సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శుక్రవారం, 10.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 168
పేజీలు: 12 వెల: రూ. 5


## కవితకు స్పాన్సర్ రేవంత్

### నిజామాబాద్ ఎంపీ అర్వింద్



- ఇద్దిర మధ్య రహస్య ఒప్పందాలు
- బీసీ సామాజిక వర్గాల పూర్తి మద్దతుతో తెలంగాణలో బీజేపీ బలోపేతం
- జగిత్యాల ఎమ్మెల్యే ఎక్కడుంటే శని అక్కడ
- రాష్ట్రంలో నాయకుల వలసలు, అంతర్గత కుమ్ములాటలతో విసిగిపోతున్న జనం

03

## ఇంధన భద్రతే లక్ష్యం

### గల్ఫ్ దేశాల్లో కేంద్ర మంత్రుల పర్యటనలు

09


- ఖతార్, యూఏఈ పర్యటనలకు కేంద్ర మంత్రులు సిద్ధం
- ఎల్ఎన్జీ సరఫరాలపై భారత్ కసరత్తు.. గల్ఫ్‌తో కీలక చర్చలు
- యుద్ధానికి బ్రేక్ తో ఇంధన పరిస్థితులపై ప్రభుత్వ చర్యలు
- కాల్పుల విరమణ తర్వాత గల్ఫ్‌లో చురుకైన భారత్ దౌత్యం



## గృహ విక్రయాల్లో హైదరాబాద్ నం.1

- చెన్నై, ముంబైలను వెనక్కి నెట్టిన భాగ్యనగర్
- దేశవ్యాప్తంగా 4 శాతం తగ్గిన ఇళ్ల విక్రయాలు..
- హైదరాబాద్‌లో మాత్రం 1 శాతం వృద్ధి
- రియల్ మార్కెట్‌లో భాగ్యనగర జోరు
- నైట్ ఫ్రాంక్ సర్వేలో కీలక విషయాలు
- ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల పరుగు..
- యుద్ధ ప్రభావం ఉన్నా హైదరాబాద్ మార్కెట్ స్టేబుల్
- ఇళ్ల అమ్మకాల్లో హైదరాబాద్ హవా!


**ముద్ర డెస్క్ :** చెన్నై నగరం హైదరాబాద్ కంటే పెద్దది. పైగా సముద్రం కూడా ఉం ది. విస్తారమైన భూభాగం ఉంది. అయినప్పటికీ హైదరాబాద్ నగ రంతో పోటీ పడలేక పోతోంది. కోల్‌కతాలో నివాస యోగ్యమైన ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. పైగా అక్కడి భూములు కూడా నిర్మాణం రంగానికి అనుకూలంగా ఉంటాయి. అయినప్పటికీ ఆ నగరం హైదరాబాద్ నగరానికి దరిదాపుల్లో కూడా లేదు. ఢిల్లీలో కాలుష్యం ఎక్కువగా ఉంటుందని అంటారు. కానీ నోయిడా.. ఉత్తరప్రదేశ్ వైపు వెళ్లే దారుల్లో పర్యావరణం మెరుగ్గా ఉంటుంది. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం **మిగతా 02లో**




# ఆర్థిక సవాళ్లు

### సర్కారు ముందు చిట్టా

## కాంగ్రెస్‌కు మొదలైన అసలు చిక్కు




- ఇప్పటిదాకా హామీలు.. కేసులతోనే కాలయాపన
- ఇప్పుడు ముందుంది అసలు సమస్య
- కారణాలు కాదు.. ఇక హామీలే
- ఆర్థిక నిస్సాహాయతను ఎదుర్కోవాల్సిందే
- లోటు బడ్జెట్.. అప్పులు.. అష్ట కష్టాలు
- ఇప్పటికే రూ. 3900 కోట్ల రుణం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్.. ప్రధానంగా సీఎం రేవంత్ సర్కారుకు అసలు సవాల్ మొదలైంది. ప్రభుత్వం ముందు సవాళ్ల బండి దూసుకుపోతోంది. ఇప్పటిదాకా బీఆర్ఎస్ మీద ఏవో కేసులు, అప్పటి హామీలు, ఆరు గ్యారంటీలు.. ఇలా ఏదో ఒక ఇష్యూతో రెండున్నరేండ్లు సాగిపోయింది. కానీ, ఇప్పుడు హామీల మీద ఎదురుదాడి మొదలైంది. ఓ వైపు లోటు బడ్జెట్, అప్పుల కుప్ప, నెలవారీ కష్టాలు సర్కారు బండికి స్పీడ్ బ్రేకర్లలా అడ్డుపడుతున్నాయి. ఇలాంటి సమయంలో కారణాలు కాదు హామీల అమలు కావాలి.. మాటల చాణక్యంతో ఆర్థిక నిస్సహాయతను రేవంత్ ఎలా అధిగమిస్తారు? అనేది ముందున్న అతిపెద్ద చిక్కు ప్రశ్న. ఆరు గ్యారంటీల అమలు విషయంలో సీఎం రేవంత్ స్పందన భిన్నంగా ఉంది. అమలు చేయడానికి సమయం పడుతుందని ఆయన చెబుతున్నారు. అయితే ఇప్పటికే రెండున్నరేళ్లు దగ్గర పడుతోంది. మిగిలిన సమయంలో కీలకమైన గ్యారంటీలు అమలు చేయకుంటే రేవంత్ కు ముందున్నవన్నీ ముళ్ల కంపే.

#### సమస్యలు మొదలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు గడుస్తున్న తరుణంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర ప్రధాన హామీల అమలు తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పెళ్లైన మూడు నెలలకే బిడ్డ పుడతారా అంటూ హామీల అమలుకు సమయం కావాలని కోరుతున్నప్పటికీ, సామాన్య **మిగతా 02లో**

## కేసీఆర్ సీఎం కావాలి

### సీఎం రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు

### జీవన్ రెడ్డి నిబద్ధత కలిగిన నేత

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మాజీమంత్రి జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానం
- కేటీఆర్ పర్యటనలో అపశృతి
- పలువురి జర్నలిస్టులకు గాయాలు
- గాయపడ్డ రిపోర్టర్ ను పరామర్శించిన మంత్రి అడ్లూరి

09




## సాదాబైనామాకు మోక్షం

### 2020లో అందిన దరఖాస్తుల క్రమబద్ధీకరణ

- రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- కొనుగోలుదారు అఫిడవిట్ సమర్పించాలన్న సర్కార్
- ఆర్డీవో పరిశీలన తర్వాత భూ భారతిలో యాజమాన్య హక్కులు
- పెండింగ్ లో 2,26,693 దరఖాస్తులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో తెల్ల కాగితాలపై జరిగిన భూ లావాదేవీల (సాదాబైనామాలు)తో రైతులు ఎదుర్కొంటున్న చట్టపరమైన, ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభించనుంది. 2020లో అందిన దరఖాస్తుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం గ్రీన్ సిగ్నల్ **మిగతా 02లో**




## పుష్కరాల లోపే పోలవరం పూర్తి

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



- గత పాలకులతో ప్రాజెక్ట్ కు తీవ్ర నష్టం
- కేంద్రంతో పునర్నిర్మాణం వేగం
- ఉచితంగా ఇసుక.. అక్రమాలపై కఠిన చర్యలు

10

## సైబర్ ఉచ్చులో పల్లా

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని బురిడీ
- నిందితుడి అకౌంట్ కు రూ. లక్ష ట్రాన్స్ ఫర్ చేసిన రాజేశ్వర్ రెడ్డి

03



## స్కూళ్లల్లో అల్పాహారం, కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

### జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అమలు



- ప్రతి ఒక్క విద్యార్థికి సకల సౌకర్యాలు
- విద్యతోనే అంతరాలు లేని, ఆదర్శ సమాజ నిర్మాణం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

09

## నిప్పుల కొలిమి

### రాష్ట్రంలో భానుడి భగభగ

- అనేక జిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- మరో 3 డిగ్రీలు పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు
- అప్రమత్తంగా ఉండాలని నిపుణుల హెచ్చరిక



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 దాటిందంటే చాలు భానుడి భగభగలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక ఉదయం 10 తర్వాత రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు చాలా పట్టణాల్లో ఇదే పరిస్థితి. ఇక తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల కింద సేద తీరుతున్నారు. కాగా **మిగతా 02లో**

## దూరిన పాక్.. దెబ్బతిన్న సీజ్‌ఫైర్


- పాక్ వ్యాఖ్యలతో అమెరికా–ఇజ్రాయెల్ అసహనం
- లెబనాన్‌పై దాడులు ఆపకపోతే ఒప్పందం కాదన్న ఇరాన్
- సమన్వయం లోపించిందా? పాక్ పాత్రపై సందేహాలు
- పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు కొత్త చిక్కులు
- సీజ్‌ఫైర్ పరిధిపై స్పష్టత లేక గందరగోళం

10

### సీజ్‌ఫైర్ ప్రకటనలో లెబనాన్ ప్రస్తావనతో కొత్త వివాదం



అంతర్జాతీయ దౌత్య చరిత్రలో అరుదైన గందరగోళం చోటుచేసుకుంది. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు అమెరికా–ఇరాన్ మధ్య కుదిరినట్లుగా భావించిన సీజ్‌ఫైర్ ఒప్పందంపై ఇప్పుడు అనుమానాల నీడలు ముసురుకున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన వివాదాస్పద ప్రకటన చిచ్చు రేపింది. ఒప్పందం పరిధిలోకి లెబనాన్‌ను లాగుతూ ఆయన చేసిన వ్యాఖ్యలను అమెరికా, ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించడంతో.. కుదురుతుందనుకున్న కాల్పుల విరమణ కాస్తా దౌత్యపరమైన ముక్కోణపు పోరాటంగా మారింది. -ముద్ర డెస్క్



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 10.04.2026
www.mudranews.in | @mudranews



ఆయిల్ + ఆముదం

జుట్టు మూలాలను బలపరుస్తుంది. రాలడం తగ్గించి గ్రోత్ పెంచుతుంది.

## గృహ విక్రయాల్లో హైదరాబాద్
# నంబర్ వన్!



(మొదటి పేజీ తరువాయి)

కూడా జోరుగా సాగుతూ ఉంటుంది. అయినప్పటికీ ఢిల్లీ నగరం హైదరాబాద్ తో పోటీ పడలేకపోతోంది. అహ్మదాబాద్ నగరంలో విస్తారమైన భూములు ఉంటాయి. పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తుంటాయి. అయినప్పటికీ ఆ నగరం హైదరాబాద్ దరిదాపుల్లో కూడా లేదు.

పూణేలో ఐటీ కార్యకలాపాలు ఎ క్కువగా సాగుతుంటాయి. ఇక్కడ గృహాలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పెద్దపెద్ద కంపెనీలు కూడా ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తుంటాయి. అయినప్పటికీ ఈ నగరం హైదరాబాద్ తో పోటీ ప డలేకపోతోంది. దేశవ్యాప్తంగా ఇళ్లవిక్రయాలు పడిపోయాయి. దీనికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. చెన్నై నుంచి మొదలుపెడితే ఢిల్లీ వరకు ఇదే పరిస్థితి ఉంది. కానీ హైదరాబాద్ నగరంలో ఇందుకు భిన్నమైన వాతావరణం ఉంది. దేశవ్యాప్తంగా అన్ని నగరాలలో గృహాల విక్రయాలపై జరిపిన సర్వేలో హైదరాబాద్ నగరం నెంబర్వన్ స్థానంలో నిలిచింది.

జనవరి నుంచి మార్చి నెల వరకు జరిపిన సర్వేలో దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాలలో గృహాల విక్రయాలు తగ్గిపోయాయి. హైదరాబాద్లో మాత్రం సానుకూల దృక్పథం కనిపిస్తోంది. ఇక్కడ గృహాల విక్రయాలు ఏకంగా ఒక శాతం పెరిగిపోయాయి. దేశ వ్యాప్తంగా చూసుకుంటే.. హైదరాబాద్ తో సహా ఎనిమిది నగరాలలో ఏకంగా 84,827 యూనిట్ల గృహాల జరిగాయి. గత ఎడాది మొదటి మూడు నెలల్లో 88,361 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. అప్పటితో చూస్తే నాలుగు శాతం తగ్గినప్పటికీ.. హైదరాబాదులో మాత్రం పరిస్థితి మెరుగ్గా ఉంది.

నైట్ ఫ్రాంక్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో హైదరాబాద్ నగరంలో సానుకూల వాతావరణ కనిపిస్తోందని వెల్లడించింది. ధరలు పెరుగుతూ పోవడం వల్ల చాలామంది గృహాలను కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదని నైట్ ఫ్రాంక్ సర్వేలో తేలింది. ఫలితంగా గృహాలు నిర్మించిన వారు పెద్దపెద్ద ప్రాజెక్టులను చేపట్టడానికి ముందుకు రావడం లేదు. దీనివల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కాస్త గందరగోళమైన వాతావరణం ఏర్పడింది. దీనికి తోడు భౌగోళిక వాతావరణం.. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరగడం వల్ల ఆ ప్రభావం గృహాల విక్రయాల మీద పడింది. హైదరాబాద్ నగరంలో 541 యూనిట్ల అమ్మకాలు చోటుచేసుకున్నాయి. గతేడాదితో పోలిస్తే చూస్తే ఇది ఒక శాతం ఎక్కువ. బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పూణే, కోల్ కతా, ముంబై వంటి ప్రాంతాలలో గృహాల విక్రయాలు జరుగుతున్నప్పటికీ.. అవి హైదరాబాద్ స్థాయిలో లేకపోవడం విశేషం.

# ఆర్థిక సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజానీకం మాత్రం ఫలితాల కోసం వేచి చూస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలులోకి తెచ్చింది. ఇవి క్షేత్రస్థాయిలో ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాయి. అలాగే, గ్యాస్ సిలిండర్లను రూ. 500 కే అందించే పథకం కూడా లబ్ధిదారులకు అందుతోంది. ఇవి కేవలం 6 గ్యారంటీలలోని ఒక భాగం మాత్రమే.

### లోటు.. అప్పులు

ఆర్థిక లోటు రాష్ట్రాన్ని.. పాలకవర్గాన్ని పట్టి పీడిస్తున్నట్లుగా మారింది. ఎందుకంటే గతేడాది లోటు బడ్జెట్ ఏకంగా 77 వేల కోట్లు దా టింది. దీంతో ఇచ్చిన హామీల్లో సగం అమలు కాలేదు. కొన్ని సంక్షేమ పథకాలను ఏకంగా దారి మళ్లించారు. రాజీవ్ యువ వికాసం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కు రూపాయి ఇవ్వలేదు. ఇటు ప్రభుత్వ రెగ్యులర్ సంక్షేమ పథకాలు కూడా అలా నడుస్తున్నాయి. అంతేకానీ, నిండు బడ్జెట్ తో కాదు. ఇదే సమయంలో అప్పులు తప్పడం లేదు. ప్రస్తుతం ఉద్యోగుల జీతాలు, కొన్ని పాత అప్పులకు సర్దుబాటు కోసం రెండు రోజుల కిందట ప్రభుత్వం ఆర్బీఐ దగ్గర రూ. 3900 కోట్లు అప్పు తీసుకుంది. ఇలా ప్రతినెలా అప్పులు తప్పడం లేదు.

**అపరిష్కృతంగా ఉన్న ప్రధాన హామీలు**


అత్యంత కీలకమైన మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 నగదు బదిలీ హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీనిపై కోట్లాది మంది మహిళలు ఆశలు పెట్టుకున్నారు. అలాగే, రైతులకు ఇస్తామన్న రూ. 15వేలు రైతు భరోసా పంపిణీలో కూడా జాప్యం జరుగుతోంది. పాత బకాయిలు తీర్చడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో, కొత్తగా పెంచిన మొత్తాన్ని ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత కరువైంది. యువతకు ఇస్తామన్న యువ వికాసం కార్డులు, నిరుద్యోగ భృతి వంటివి కూడా ఇంకా చర్చల దశలోనే ఉన్నాయి. అతి పెద్ద సవాల్ పెన్షన్ల పెంపు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు సహా అనేక వర్గాలకు ఇస్తున్న పెన్షన్లను భారీగా పెంచుతామని రేవంత్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరూక అమలు కాలేదు.

**ఆర్థిక ఇబ్బందులు - రేవంత్ రెడ్డి సమర్థన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచుగా గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 7 లక్షల కోట్ల అప్పుల గురించి ప్రస్తావిస్తూ, ఖజానా ఖాళీగా ఉండటం వల్లే హామీల అమలులో జాప్యం జరుగుతోందని వివరిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తనను తాను సమర్థించుకోవడానికి ఉపయోగపడవచ్చు కానీ, ప్రజల్లో ఉన్న అసహనాన్ని తగ్గించలేకపోతున్నాయి. సంక్షేమ పథకాలకు నిధులు సర్దుబాటు చేయడం కోసం ప్రభుత్వం కొత్త అప్పులు చేయాల్సి రావడం లేదా ఇతర అభివృద్ధి పనులకు నిధులు కోత విధించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడు ఆరు నెలల నుండి ఏడాది లోపు కనీస మార్పును ఆశిస్తారు. రెండున్నర ఏళ్లు దాటినా కీలక హామీలు అందకపోవడం వల్ల ప్రజల్లో నెమ్మదిగా వ్యతిరేకత మొదలయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్య తరగతి, గ్రామీణ ఓటర్లు కేవలం వివరణల కంటే, తమ ఖాతాల్లోకి వచ్చే నగదు లేదా తమ బతుకుల్లో వచ్చే మార్పునే గమనిస్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వాక్చాతుర్యంతో ఎంతకాలం నెట్టుకొస్తుందో కానీ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి హామీల అమలులో పురోగతి చూపకపోతే అది పార్టీకి నష్టం చేయచ్చు.

**మాటలు కాదు.. ఆర్థిక పరిష్కారం ముఖ్యం**

ప్రజాస్వామ్యంలో ఎన్నికల మేనిఫెస్టో అనేది ఒక పవిత్రమైన పత్రం. దానిని కేవలం ఓట్లు దండుకోవడానికి ఉపయోగించే కాగితం గా కాకుండా, ప్రజలతో చేసుకున్న ఒప్పందంగా భావించాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివరణలను పక్కన పెట్టి, ఆర్థిక వనరులను సమకూర్చుకుని మిగిలిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, మరో అవకాశం ఇస్తాం అని చెప్పే లోపే ప్రజల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురయ్యే ప్రమాదం ఉంది.







# సాదాబైనామాకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)


ఇచ్చింది. కొనుగోలుదారు అఫిడవిట్ సమర్పిస్తే.. ఆర్డీవో పరిశీలన అనంతరం భూ భారతిలో యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. ఈ మేరకు సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,26,693 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. ఈ పత్రాలకు సరైన రిజిస్ట్రేషన్ లేకపోవడంతో భూమిపై రైతులకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు లేకుండాపోయాయి. దీంతో భూభారతి పోర్టల్లో భూమి వివరాలు నమోదు కాక.. రైతుబంధు, రైతుబీమా వంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. బ్యాంకు నుంచి పంట రుణాలు పొందటం కూడా రైతులకు సాధ్యపడటం లేదు. భూముల ధరలు పెరగడంతో.. పాత యజమానులు, వారి వారసులు వివాదాలకు దిగడంతో రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. భూమి రికార్డులు స్పష్టంగా లేకపోవడంతో క్రయవిక్రయాలు చేయడం కూడా రైతులకు కష్టతరంగా మారింది.ఈ నేపథ్యంలో సాదాబైనామా సమస్యల పరిష్కారం విషయంలో సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ వ్యాప్తంగా 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10వ తేదీ వరకు స్వీకరించిన సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ గురువారం అందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇటీవల అఫిడవిట్ నిబంధన సవరించిన నేపథ్యంలో.. వీలైనంత త్వరగా సాదా బైనామా భూముల క్రమబద్ధీకరణను పూర్తి చేయాలని సర్కార్ ఆదేశించింది. భూమి కొనుగోలుదారు మాత్రమే ఆధారాలతో కూడిన అఫిడవిట్ జత చేయాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొంది.

ఆర్డీవో ఓకే అంటే.. 30 రోజుల్లో పరిష్కారం ఆర్డీవో ఆధారాలు పరిశీలించి క్రమబద్ధీకరణకు సిఫార్సు చేస్తారని.. 30 రోజుల్లోగా భూయజమాని పేరును భూ భారతిలో నమోదు చేసి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే.. క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేసి పరిశీలన చేస్తారన్నారు. సాదా బైనామాకు సంబంధించి అక్రమమని తేలితే.. క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారాన్నంతటిని ఆయా జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షించాలని సీసీఎల్ఏ కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాల్లో సూచించారు.

**ఎఫ్టీఎస్ సిబ్బంది సంఖ్య కుదింపు**

భూభారతి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎమ్మార్వో సంయుక్త సబ్ రిజిస్ట్రార్కు సహాయకారిగా ఉండేందుకు నియమించిన ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సంఖ్యను కుదిస్తూ రెవెన్యూశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 636 మంది ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ పనిచేస్తున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు వారి పనిభారాన్ని మండలాల వారీగా పరిశీలించిన భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ఎఫ్టీఎస్ సంఖ్యను కుదించాలని తాజాగా నిర్ణయించారు. జిల్లా సమన్వయకర్తలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 332 మంది ఎఫ్టీఎస్లు ఉంటే చాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరకు వారి సంఖ్యను కుదిస్తూ రెవెన్యూశాఖ తాజాగా నిర్ణయం తీసుకుంది. మార్చి నెలాఖరుతో ముగిసిన ఎఫ్టీఎస్ విధుల గడువును ఈ మేరకు 2027 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లా కలెక్టర్లను సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# నిప్పుల కొలిమి



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్నగర్ జిల్లాలకు గురువారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. నేటి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 8న రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణశాఖ తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని చెప్పింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5 డిగ్రీల సెల్సియస్, నల్లగొండ జిల్లా నేరడుగొమ్ములో 41.5 డిగ్రీల సెల్సియస్, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4 డిగ్రీల సెల్సియస్, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2 డిగ్రీల సెల్సియస్, వరంగల్ జిల్లా సంగెంలో 41.2 డిగ్రీల సెల్సియస్, హైదరాబాద్లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు.

**అప్రమత్తంగా ఉండండి**

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండలో శరీరం నుంచి చెమట రూపంలో నీరు, లవణాలు బయటకు పోతాయని.. కాబట్టి దాహం వేయకపోయినా తరచుగా నీరు తాగుతూ ఉండాలని చెబుతున్నారు. మంచినీటితో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ అందుతాయని అంటున్నారు. చక్కెర శాతం ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, కెఫిన్ అధికంగా ఉండే కాఫీ, టీలకు దూరంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని.. అత్యవసరమైతే తప్ప ఈ సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిదని అంటున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలని.. తలకు ఎండ తగలకుండా గొడుగు, టోపీ వంటివి ధరించాలి అంటున్నారు. కళ్లకు రక్షణగా సన్ గ్లాసెస్ వాడటం మంచిదని చెబుతున్నారు. వేసవిలో తేలికపాటి ఆహారం తీసుకోవాలని.. వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# పొంగులేటీ.. నీ పొగరు తగ్గించుకో
## అవినీతి చిట్టా ఒక్కొక్కటిగా విప్పుతాం
## మాజీ మంత్రి హరీశ్‌రావు

**ముద్ర, వనపర్తి:**

'పొంగులేటి నీ పొగరు తగ్గించుకో.. లేకపోతే నీ అవినీతి చిట్టాలు ఒక్కొక్కటిగా విప్పుతాం. నీ అవినీతి అక్రమాల విషయాలు బయటకు రావాల్సిందే నంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై మండిపడ్డారు. గురువారం వనపర్తి జిల్లా గొల్లపల్లి–చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ బాధితులు చేస్తున్న దీక్షలు నూరు రోజులు పూర్తయిన సందర్భంగా వారికి సంఘీభావంగా ఏదుల వద్ద నిర్వహించే బహిరంగ సభకు వచ్చిన ఆయన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రాఘవ కన్స్ట్రక్షన్స్ లో అవినీతిని తమ అధికారులే గుర్తుపట్టారని చెప్పారని, ఆ మైనింగ్ నీది కాకపోతే అక్కడ కంటెయినర్ మీద రాఘవ కన్స్ట్రక్షన్స్‌పేరు, కాంగ్రెస్ జెండా ఎందుకున్నాయో సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. అసెంబ్లీలోనే ఉన్న మంత్రి తనకు మైనింగ్ లేదని ఎందుకు చెప్పలేదన్నారు. ఆయన మాట్లాడే తీరు మంత్రిగా కాకుండా రాఘవ కన్స్ట్రక్షన్స్ అధినేతగా మాట్లాడినట్టుందన్నారు. తానొక్కడినే అవినీతిపరున్ని కాదు, తమ క్యాబినెట్లోని కొందరూ అవినీతిపరులని ఆపాదించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. జూపల్లి కృష్ణారావు,ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల టెండర్లు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్సంటేజీలు రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి కుంభకోణాలలో మంత్రుల కుంభకోణాలు కూడా ఉన్నాయంటూ చెప్పే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అంటూ అభివర్ణించారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ లో జరిగిన అవినీతి అక్రమాలను తమ అధికారులే బయటికి తీశారని, జరిమానా వేశారన్నారు. రెవెన్యూ, పొల్యూషన్, మైనింగ్, విద్యుత్ శాఖల అధికారులు రాఘవ కన్స్ట్రక్షన్ కు నోటీసు లిచ్చారని, నాలుగు శాఖల అధికారులు చెప్పింది తప్పా, పొంగులేటి చెప్పింది తప్పా, మైనింగ్ మంత్రి చెప్పింది తప్పా చెప్పాలని డిమాండు చేశారు. నాదర్‌గుల్ భూముల విషయంలో బీఆర్ఎస్ 2016లో ఈ భూములను నిషేధిత జాబితాలో పెట్టిందని, ఈ భూములను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తే ఆర్డీవో ఈ భూములను నిషేధిత జాబితాలో పెట్టారన్నారు. 2022 లో కంపెనీలు హైకోర్టుకు పోతే ప్రభుత్వం తన వాదన వినిపించి ఆర్డీవో నిర్ణయం సరైనదేనని చెప్పారన్నారు. శిల్ప, కోహినూర్, ఏ క్యు స్క్వేర్ కంపెనీ నీ కొడుకు పేరున లేదా, శిల్ప సంస్థతో వ్యాపార సంబంధాలు లేవా అంటూ ప్రశ్నించారు. నాదర్‌గుల్ భూమి ప్రభుత్వ భూమని సుప్రీంకోర్టులో వేశామంటున్నప్పుడు నీతి, నిజాయితీ చిత్తశుద్ధి ఉంటే ఆ భూములను ఎందుకు స్వాధీనం చేసుకోలేదంటూ దుయ్యబట్టారు. రెండున్నర ఏళ్లు గా ఏం చేస్తున్నారన్నారు. గవర్నమెంట్ ల్యాండ్ సీలింగ్ ల్యాండ్ ఉంటే హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.





# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

అంతర్ జిల్లా దొంగల ముఠాను సిద్దిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ గురువారం కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన సిద్దిపేటలోని చేర్యిత మెడోస్‌లో ఓ డాక్టర్ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి కత్తులతో బెదిరించి నగదు, బంగారు ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో 10 పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిందితులను గాలించారు. సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి నిందితులను పట్టుకున్నారు. దర్యాప్తులో భాగంగా బెల్లంపల్లికి చెందిన శ్రీకాంత్ అలియాస్ క్రాంతి ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. అతను ఆర్మీలో పనిచేసి రిటైర్ అయిన అనంతరం రామగుండం ఐటీసీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో దోపిడీకి పథకం రచించాడు. హైదరాబాద్‌కు చెందిన రాకేష్, శ్యామ్, గోదావరిఖనికి చెందిన చంద్రశేఖర్ సహకారంతో ములుగు ప్రాంతానికి చెందిన గణేష్, ప్రేమ్ చందు, పవన్‌లను దోపిడీకి ఒప్పించాడు. వీరిపై పలు ప్రాంతాల్లో రాబరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పథకం ప్రకారం నిందితులు ముందురోజు రేకీ నిర్వహించి, మరుసటి రోజు రాత్రి ఇంట్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న మహిళలు, పిల్లలను బెదిరించి బంగారు ఆభరణాలు, నగదు, సెల్ ఫోన్లు దోచుకున్నారు. అనంతరం బాధితులను కట్టేసి పరారయ్యారు. దోపిడీ చేసిన బంగారాన్ని ప్రకాష్, వినయ్ అనే వ్యక్తుల సహాయంతో తాకట్టు పెట్టి నగదు పొందినట్లు పోలీసులు వెల్లడించారు. గురువారం పోలీసులు 9 మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 4.6 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారు, ఒక బైక్, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ రాజేష్, చిన్నకోడూరు ఎస్ఐ చంద్రమోహన్, రాజగోపాల్పేట ఎస్ఐ వివేక్, బెజ్జంకి ఎస్ఐ సౌజన్యతో పాటు పోలీస్ సిబ్బంది రాజు, సుభాష్, యాదగిరి, స్వాములను సీపీ అభినందించారు.

జుట్టు సంరక్షణకు ఆలివ్ ఆయిల్ + కొబ్బరి నూనె

జుట్టుకు లోతైన పోషణ ఇస్తుంది. ప్రోటీన్ నష్టం తగ్గిస్తుంది.




# సైబర్ ఉచ్చులో పల్లా

- వికసిత్ భారత్ పేరుతో జనగామ ఎమ్మెల్యేకు టోకరా
- కేంద్ర ఉన్నతాధికారి అని ఫోన్ లో పరిచయం
- ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని బురిడీ
- నిందితుడి అకౌంట్ కు రూ.లక్ష ట్రాన్స్ ఫర్ చేసిన రాజేశ్వర్ రెడ్డి
- జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించిన ఎమ్మెల్యే





**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. కేంద్ర పథకం వికసిత్ భారత్ పథకం కింద ఆ నియోజకవర్గ ప్రజలకు రూ. పది లక్షల వరకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించిన ఓ నిందితుడు ఎమ్మెల్యే నుంచి రూ .లక్ష కాజేశాడు. పల్లా కు ఫోన్ చేసిన సదరు నిందితుడు తాను కేంద్రంలో ఉన్నత హోదాలో ఉన్నానని నమ్మించి బురిడి కొట్టించాడు. అతని మాటలు నమ్మిన పల్లా.. గంట వ్యవధిలోనే సదరు నిందితుడు చెప్పిన అకౌంట్ లో రూ.లక్ష జమా చేశారు. తర్వాత అనుమానం వచ్చి ఆరా తీయగా.. అది ఫేక్ కాల్ అని నిర్ధారణకు వచ్చారు. వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రెటరీ అనంత రామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్ధిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈ రోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ. 2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నెంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్ నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నెంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.





# కవితకు స్పాన్సర్ రేవంత్

- ఇద్దరి మధ్య రహస్య ఒప్పందాలు, ఎజెండాలు
- బీసీ సామాజిక వర్గాల మద్దతుతో తెలంగాణలో బీజేపీ బలోపేతం
- మీడియాతో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

**ముద్ర, నిజామాబాద్ :**

రాష్ట్రంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపడుతోన్న కార్యక్రమాలకు, పార్టీ కార్యకలాపాలకు సీఎం రేవంత్ రెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. వీరిద్దరి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని విమర్శించారు. తెలంగాణలో బీసీ సామాజిక వర్గాల పూర్తి మద్దతుతో బీజేపీ బలోపేతం అవుతోందన్న ఆయన రానున్న రోజుల్లో పార్టీ మరింత పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం, రేవంత్, కవిత లోపాయికారీ ఒప్పందం.. పరస్పర సహకారంతో రాష్ట్రంలో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఎక్కడుంటే అక్కడ శని ఉంటుందని అర్వింద్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు డాక్టర్ శ్రావణిని పార్టీ నుండి పంపించారన్న ఆయన ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి సీనియర్ నేత జీవన్‌రెడ్డిని ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఈ విషయంలో సీనియర్ నేత జీవన్ రెడ్డి తొందరపడుతున్నారని అర్వింద్ అభిప్రాయపడ్డారు. సంజయ్ మళ్ళీ కాంగ్రెస్ వదిలి బీఆర్ఎస్‌లోకి వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆయన వెళ్లే వరకు అక్కడ ప్రశాంతత ఉండదని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాజకీయాల్లో నాయకుల వలసలు, అంతర్గత కుమ్ములాటలు చూస్తుంటే ప్రజలు విసిగిపోతున్నారన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారని అర్వింద్ పేర్కొన్నారు.

# అంగన్‌వాడీలను బలోపేతం చేస్తాం

- త్వరలోనే 15వేల పోస్టులు భర్తీ
- ప్రభుత్వ పరిశీలనలో జీతాల పెంపు అంశం
- ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులోనూ అంగన్‌వాడీలకు ప్రాధాన్యం
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ముద్ర, మహబూబాబాద్ :**

రాష్ట్రంలో అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు భర్తీ చేస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 15వేల అంగన్‌వాడీ పోస్టులను త్వరలోనే ప్రకటించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు జీతాలు పెంచే అంశంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న ఆమె ఆ అంశాన్ని పరిశీలిస్తోన్నట్లు వెల్లడించారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 1368 మంది అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు అందజేశామనీ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37 వేల మందికి ఈ ఫోన్లు పంపిణీ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులోనూ అంగన్‌వాడీ సిబ్బందికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్ల జీతాల్లో కేంద్ర ప్రభుత్వం తన వాటాను పెంచాలని ఇప్పటికే కేంద్రాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.



# ఆహార కల్తీలో తెలంగాణ టాప్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఆహార కల్తీలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆరోపించారు. నగరాన్ని ఫ్యూచర్ సిటీ.. కల్తీ లేని సిటీలుగా చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇది రైజింగ్ తెలంగాణ కాదు.. అనారోగ్య తెలంగాణ అవుతోందని సెటైర్లు వేశారు. గురువారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్ లో అల్లం నుంచి పనీర్ వరకూ అన్నీ కల్తీ జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. లేదంటే కనీసం ప్రైవేట్ కంపెనీకి అయినా అప్పగించాలన్నారు. అదే సమయంలో కల్తీ విషయంలో కఠిన చట్టాలు తేవాలన్నారు. కల్తీ చేస్తున్నవారి విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. తమిళనాడులో 500 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసిన విషయాన్ని అంజిరెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధానం మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్తీని అడ్డుకోకపోతే హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతినే ప్రమాదం ఉందని అంజిరెడ్డి హెచ్చరించారు.

# ఏపీ, తెలంగాణ ఆదాయపన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్

- కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు నుంచి ఉత్తర్వులు జారీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సీనియర్ ఐఆర్ఎస్ అధికారి సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ బాధ్యతల్లో ఉన్న మోరంపూడి అనిల్ కుమార్ స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు స్వీకరించనున్నారు. అనిల్ కుమార్ కూడా తెలుగు అధికారి కావడం, ఆయన స్థానంలో మరోసారి మరొక తెలుగు అధికారికి ఈ అత్యున్నత పదవి దక్కడం విశేషం. సురేశ్ బత్తిని గతంలో హైదరాబాద్ రీజియన్‌లోనే చీఫ్ కమిషనర్‌గా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. రెండు రాష్ట్రాల్లోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపన్ను శాఖకు సంబంధించి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ అనేది అత్యున్నత పదవి. పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షించడంతో పాటు చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటివి ఆయన ప్రధాన బాధ్యతలు. త్వరలోనే సరేశ్ బత్తిని హైదరాబాద్‌లోని ఆదాయపన్ను కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# యాదాద్రి నరసింహుని దర్శించుకున్న దేవాదాయ కమిషనర్

**ముద్ర, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని గురువారం తెలంగాణ దేవాదాయ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్ర చార్యులు ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఛైర్మన్ నరసింహ మూర్తి స్వామివారి లడ్డు ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఆలయ అర్చకులు ఉప ప్రధాన అర్చకులు మాధవాచార్యులు సిద్ధార్థాచార్యులు, డీఈవో నవీన్ కుమార్, ఏ ఈ ఓలు శంకర్ నాయక్, మహేష్ కుమార్, సూపరిండెంట్లు సురేందర్ రెడ్డి , రాజన్ బాబు, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది నందు నాయక్, అనిల్, ఆలయ ఇంచార్జ్ అర్జున్ ఉన్నారు.




# కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ముగిసిన పోలింగ్

**ముద్ర, డెస్క్:**

కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం.

# ఫాసిజం కాదు.. ప్రజాస్వామ్యం కావాలి

- నేటి సవాళ్లను తొలితరం నాయకులు ముందే ఊహించారు
- ఫాసిజం కొత్త రూపాల పెరుగుదల ఆందోళనకరం
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



నేటి సమాజం రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. నేటి సవాళ్లను తొలితరం నాయకులు ముందే ఊహించారని వెల్లడించారు. ఫాసిజం కొత్త రూపాల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేశారు. జమీందారీ వ్యవస్థ రద్దు, వ్యవసాయ పోరాటాలు, సమానత్వం దిశగా కీలకమైన అడుగులని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, అర్థశాస్త్ర విభాగం, చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా నిర్వహిస్తున్న "ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం : విభేదాలు, భవిష్యత్ దిశ" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాసా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి మాత్రమే కాకుండా ఓ విశిష్ట ఆర్థికవేత్త అని పేర్కొన్నారు. సామ్యవాద స్ఫూర్తి రాజ్యాంగంలో అంతర్లీనంగా నిక్షిప్తమై ఉందన్న ఆయన ముఖ్యంగా సమానత్వం, న్యాయంపై పీఠిక ఇచ్చిన ప్రాధాన్యతలో ఇది ప్రతిబింబిస్తుందని చెప్పారు. 1946 నాటి కరాచీ తీర్మానాన్ని ప్రస్తావిస్తూ అది భారతదేశంలో సామాజికఆర్థిక హక్కులకు పునాది వేసిందన్నారు. కాలక్రమేణా అనేక రాజ్యాంగ సవరణలు ఆర్థిక పరమైన ఆందోళనలను పరిష్కరించాయని ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలో ఉన్నత విద్యారంగంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత రాజ్యాంగాన్ని, అందులోని ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పెరుగుదల విద్యారంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందన్నారు. అందరికీ ఉన్నత విద్యా అందుబాటులో లేకుండా పోతోందని ఆవేదన వ్యక్త చేశారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ అధ్యాపకులు ప్రొ.ప్రభాత్ పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజా సంక్షేమాన్ని నిర్ధారించడానికి ప్రభుత్వం కీలక రంగాలపై నియంత్రణను కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ రంగానికి, జాతీయకరణకు ప్రాధాన్యతనిచ్చిన 1948 పారిశ్రామిక విధానాన్ని ఆయన గుర్తుచేశారు. ఆర్థిక విధానాలు ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. పెరుగుతున్న అసమానతలను ఎత్తిచూపుతూ, సంపదలో గణనీయమైన వాటా అగ్ర భాగం ఒక శాతం మంది వద్ద మాత్రమే కేంద్రీకృతమై ఉందనీ ఇది దేశ అభివృద్ధికి ఉపయోగపడదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్పా చక్రపాణి మాట్లాడుతూ.. ప్రజా విధానాలను రూపొందించడంలో సామాజిక న్యాయం, సమానత్వ ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత ఆర్థిక న్యాయంపై కొత్తగా దృష్టి సారించారని తెలిపారు. సెమినార్ డైరెక్టర్ ప్రొ.పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడంలో 1948 పారిశ్రామిక విధాన ప్రాముఖ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కోడైరెక్టర్ , ఆర్థికశాస్త్ర విభాగాధిపతి ప్రొ.కె. కృష్ణారెడ్డి; కన్వీనర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చంచల్‌గూడ) వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.జి. నాగోజీ; సీనియర్ ప్రొఫెసర్ ఐ. సుధారాణి, ప్రొ. పల్లవి కాబ్డే, ప్రొ.ఆనంద్ పవార్, ప్రొ. శ్రీనివాస్ వడ్డాణం, ప్రొ. పి. వెంకట రమణ, ప్రొ. జి. దయాకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చంచల్‌గూడ) అధ్యాపక సిబ్బంది, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
10.04.2026 శుక్రవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



## దుష్ప్రభావాలు లేని వైద్య విధానం
# హోమియోపతి

**(10 ఏప్రిల్ "ప్రపంచ హోమియోపతి దినోత్సవం" సందర్భంగా)**

ప్రజారోగ్య పరిరక్షణలో హోమియోపతి వైద్య విధానాలను వ్యాప్తి చేయడానికి, హోమియో వైద్య అభివృద్ధికి, సవాళ్లను అధిగమించడానికి, సాధారణం ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌న "ప్రపంచ హోమియోపతి దినోత్సవం" నిర్వహించకపోవడం ఆనవాయితీగా మారింది. హోమియో వైద్య వ్యవస్థాపకుడు, పితామహుడు అయిన డా క్రిస్టియన్ శామ్యూల్ హానిమాన్ జన్మదినం 10 ఏప్రిల్ 1755 సందర్భంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం నిర్వహించడం కొనసాగుతున్నది. ప్రకృతి ప్రసాదించే మొక్కలు, ఖనిజాలు, జంతువుల నుంచి సేకరించిన ఔషధాలతో వ్యాధులకు హోమియో చికిత్సలు చేస్తారు. హోమియోపతి వైద్య విధానానికి ప్రధాన సూత్రంగా "లైక్ లౌస్ లైక్" అనే భావాన్ని తీసుకుంటారు. హోమియోపతి అనగా హోమియో (ఒకే రకమైన), పతోస్ (వ్యాధి) అనే గ్రీక్ భాష అర్థాలు ఉన్నాయి.

భారతంలో హోమియోపతికి ప్రజాదరణ:

హోమియోపతి వైద్య విధానం భారతంలో 1973లో ప్రభుత్వ గుర్తింపుతో బహుళ ప్రచారం పొందడం, 2014 తర్వాత అల్లోపతి వైద్యంతో పాటు "ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ యోగా, నాచురోపతి, హోమియోపతి)" అంత్రికడత్వ శాఖను ప్రారంభించి హోమియో వైద్య విధానానికి పట్టం కట్టడం జరిగింది. శరీర వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూ వ్యాధి మూలాలను కనుగొని ఔషధ చికిత్సను చేయడం, ఎలాంటి ఔషధ దుష్ప్రభావాలు లేకుండా ఉండడం హోమియో ప్రత్యేకతగా తీసుకోవాలి. మన దేశంలో అనేక అనేక హోమియో వైద్య కళాశాలలు, హోమియో ఆసుపత్రులు ప్రారంభించడం జరుగుతున్నది. హోమియోపతి వైద్యం ద్వారా చర్మ, జీర్ణకోశ, ఎలర్జీ, మైగ్రెయిన్, మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పులు, నీరసం, రుతుస్రావం ముందు అనారోగ్యం, దీర్ఘకాలిక అలసట, అస్తమా, వినికిడి రోగాలు, బిపీ, జలుబు లాంటి వ్యాధులకు సమర్థవంతంగా చికిత్సలు చేస్తారు. దేశవ్యాప్తంగా 100 మిలియన్ల ప్రజలు హోమియో చికిత్సలు పొందుతుండగా, 2 లక్షల హోమియో డాక్టర్లు సేవలు అందిస్తూ, ప్రతి ఏట 12,000 మంది వైద్యులు హోమియో రంగంలోకి అడుగిడుతున్నారు. ప్రపంచ హోమియో దినం రోజుల హోమియో వైద్య శిబిరాలు, సెమినార్లు, సింపోజియాలు, కార్యశాలలు, హోమియో వైద్యులను సన్మానించడం లాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ప్రపంచ హోమియోపతి దినోత్సవం2026 ఇతివృత్తంగా "హోమియోపతితో సామరస్యం హద్దులు దాటి వైద్యం చేయడం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. సహజమైన, సరళమైన, సురక్షితమైన, ప్రభావితమైన హోమియోపతితో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా రోగం మూలలను కనుగొని స్వస్థత చేకూర్చుతున్న ప్రపంచ హోమియోపతి వైద్యులకు, హోమియో వైద్యం పొందుతున్న రోగులకు ప్రపంచ హోమియోపతి దినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం.



**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# ఇవి గౌరవ హత్యలా?

## సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జరిగిన ఈ దారుణం కేవలం హృదయవిదారక సంఘటన మాత్రమే కాదు... మన సమాజం ఎంత లోతుగా వికృత భావజాలాలకు లోనైందో స్పష్టంగా చూపించే భయానక ప్రతిబింబం. 29 ఏళ్ల కవిత తన వ్యక్తిగత నిర్ణయాల నేపథ్యంలో జీవితం కొత్త మలుపు తీసుకోవాలని ప్రయత్నించిన క్షణంలోనే, ఆమె ప్రాణం బలైపోయింది. భర్త సిద్ధారెడ్డి (35) ఆమెను తిరిగి తీసుకువస్తున్న క్రమంలోనే, పోలీసుల సమక్షంలో కత్తితో గొంతు కోసి హత్య చేయడం కేవలం క్రూరత్వం కాదు... మనిషి విలువలు ఎంత పతనమయ్యాయో చెబుతున్న ఘోర సాక్ష్యం. ఈ ఘటనతో 9 ఏళ్ల కూతురు, 6 ఏళ్ల కుమారుడు ఒక్కసారిగా అనాథలుగా మారడం... ఈ విషాదానికి మరింత భారాన్ని జోడిస్తోంది. ఇది ఒక్క కుటుంబం కథ కాదు... సమాజం మొత్తం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన ఘట్టం.

ఇది ఒక్క సంఘటన కాదు. కానీ ఈ ఘటన సోషల్ మీడియాలో (ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో) తీసుకున్న రూపం మరింత భయానకం. భార్యను చంపిన భర్త సిద్ధారెడ్డిని చాలా మంది "మంచి పని చేశావ్", "గౌరవం కాపాడావ్", "అభినందనలు" అంటూ పొగడుతున్నారు. "ఇలాంటి భార్యలకు ఇదే శిక్ష" అని కీర్తిస్తున్న పోస్టులు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్నాయి. హత్యను 'గౌరవ హత్య'గా చిత్రీకరించి, వైరల్ చేసి, లైకులు, షేర్లు సంపాదిస్తున్నారు. ఇది కేవలం ఆన్‌లైన్ ట్రోలింగ్ కాదు... హింసను సాధారణీకరించి, సమర్థిస్తూ, సమాజంలో అంగీకారానికి నెడుతున్న ప్రమాదకర సామూహిక వికృతి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో సహా దేశవ్యాప్తంగా వివాహేతర సంబంధాలు, ఎలోప్‌మెంట్‌లు హత్యలకు దారితీస్తున్నాయి. ఇటీవలి ఘటనల్లో కూడా సోషల్ మీడియా ఇదే విధంగా హంతకులను 'హీరో'లుగా మలచడం గమనార్హం. ఒకప్పుడు వ్యక్తిగత విషాదాలుగా మిగిలిపోయే సంఘటనలు, ఇప్పుడు డిజిటల్ వేదికల్లో ప్రదర్శనలుగా మారుతున్నాయి. సంబంధాల సంక్లిష్టతను అర్థం చేసుకోవాల్సిన చోట... హింసను న్యాయబద్ధం చేసే తీరు పెరుగుతోంది. పురుషాధిక్య మనస్తత్వం, "భార్య నా సొత్తు" అనే భావజాలం ఇవే ఈ దారుణాలకు మూలాధారాలు.

ఈ సంఘటనల మూలం ఇంకా పాతబడ్డ విలువల్లోనే ఉంది. వివాహం 'శాశ్వత బంధం', విడాకులు 'అవమానం' అనే అపోహలు ఇప్పటికీ బలంగా ఉన్నాయి. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా స్వతంత్రంగా ఎదుగుతున్నా... పురుషులలో ఆధిపత్య భావన మాత్రం తగ్గలేదు. సోషల్ మీడియా ఈ వికృత భావజాలాన్ని మరింత రెచ్చగొట్టే సాధనంగా మారుతోంది. హత్య చేసిన వ్యక్తిని 'హీరో'గా చూపించడం ద్వారా యువతరం మనసుల్లో హింసను సహజంగా, కొన్నిసార్లు ఆకర్షణీయంగా చూపించే ప్రమాదకర ధోరణి పెరుగుతోంది.

పోలీసు వ్యవస్థ కూడా ఇక్కడ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎలోప్ కేసుల్లో సరైన కౌన్సెలింగ్ లేకుండా, భద్రతా అంచనాలు చేయకుండా వ్యక్తులను తిరిగి కుటుంబాలకు అప్పగించడం... ఇలాంటి దారుణాలకు మార్గం సుగమం చేస్తోంది. మానసిక ఆరోగ్య సమస్యలు, అధిక మద్యపానం, భావోద్వేగ నియంత్రణ లోపం, విద్యా లోపం - ఇవన్నీ కలిసివచ్చి హింసాత్మక ప్రవర్తనకు కారణమవుతున్నాయి.

చట్టం (IPC 302) ఉన్నా, వేగవంతమైన న్యాయ వ్యవస్థ లోపం వల్ల బాధితులకు న్యాయం ఆలస్యం అవుతోంది. అదే సమయంలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు హింసను ప్రోత్సహించే కంటెంట్‌ను నియంత్రించడంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. స్వేచ్ఛా భావ ప్రకటన పేరుతో హింసను మహిమాపరచడం అనేది సమాజానికి ముప్పు.

హత్య ఎప్పుడూ 'న్యాయం' కాదు. "గౌరవం కాపాడావ్" అని చెప్పడం... మనిషి విలువలపై ముద్ర వేయడం కాదు, వాటిని అవమానించడం. ప్రేమ, ఆకర్షణలు సహజం. కానీ హింసకు ఏ సందర్భంలోనూ సమర్థన ఉండదు. ఒక మనిషి ప్రాణాన్ని తీసిన చర్యను అభినందించడం అంటే... మన పిల్లల భవిష్యత్తులో హింసను విత్తడం వంటిదే.

పాఠశాలలు, కాలేజీల్లో లింగ సమానత్వం, సంబంధాల నిర్వహణ, భావోద్వేగ అవగాహన, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై కౌన్సెలింగ్ తప్పనిసరి చేయాలి. జిల్లా స్థాయిలో ఉచిత కౌన్సెలింగ్ కేంద్రాలు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేయాలి. ఎలోప్ కేసుల్లో ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్స్ అమలు చేయాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, ఇలాంటి కేసులకు త్వరితగతిన న్యాయం అందించాలి. సోషల్ మీడియాలో హింసను ప్రోత్సహించే కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రతి ఒక్కరం బాధ్యత తీసుకోవాలి - హింసను మహిమాపరచే పోస్టులను రిపోర్ట్ చేయాలి, విడాకులను సామాజికంగా అంగీకరించే దిశగా ఆలోచించాలి, మహిళల స్వాతంత్ర్యాన్ని గౌరవించాలి. సమాజం మార్పు వ్యక్తి స్థాయిలోనే ప్రారంభమవుతుంది.


కవిత హత్య ఒక కుటుంబ విషాదం మాత్రమే కాదు... ఇది మన సమాజం దారి తప్పుతున్న సంకేతం. హింసను "మంచి పని"గా భావించే స్థాయికి చేరుకున్నామంటే, మన విలువలు ఎంత ప్రమాదంలో ఉన్నాయో అర్థం చేసుకోవాలి. సోషల్ మీడియాలో లైక్ కొట్టే ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి - మీరు కేవలం ఒక పోస్టును కాదు, ఒక ప్రమాదకర భావజాలాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రేమ మనిషిని నిలబెడుతుంది... హింస మనిషిని నాశనం చేస్తుంది. గౌరవం జీవాన్ని కాపాడాలి... ప్రాణం తీసే కారణం కావొద్దు. ఇప్పటికైనా మేల్కొందాం. లేకపోతే... ఇంకా ఎన్నో కవితల కథలు ఇలా విషాదంగా ముగుస్తూనే ఉంటాయి.



**(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)**

# 'ఆదర్శ కమ్యూనిస్టు' నర్రా రాఘవ రెడ్డి







ప్రత్యక్ష రాజకీయాలలో కష్టజీవుల తరపున గొంతెత్తి నినదించిన 'ఆదర్శ కమ్యూనిస్టు' నర్రా రాఘవ రెడ్డి 1924 లో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని చిట్యాల మండలంలో గల వట్టిమర్తి గ్రామంలో నర్రా రాంరెడ్డి, కనకమ్మ దంపతులకు జన్మించారు. నర్రా రాఘవ రెడ్డి సొంత తండ్రి ప్రేమకి నోచుకోక, సవతి తల్లి పోరు పడలేక ప్రాథమిక విద్యను మధ్యలోనే వదిలేసి బతుకుదెరువు కోసం తన స్నేహితుడు బూరుగు రామచంద్రంతో కలిసి హైదరాబాద్, అటు పిమ్మట ముంబైకి చేరి గైక్వాడ్ జూట్ మిల్లులో కూలీగా పనిచేశారు. ఆ సమయంలో ముంబైలో కమ్యూనిస్టు పార్టీకి కార్మిక సంఘంగా ఎదుగుతున్న 'లాల్ బావుటా' సంఘంలో చేరడం తద్వారా ఆయన జీవితంలో గొప్ప మలుపు తిప్పింది. అక్కడ ఆయన కార్మిక పోరాటాలలో పాలుపంచుకుని కమ్యూనిజం పట్ల ఆకర్షితులయ్యారు. అక్కడ ట్రేడ్ యూనియనిస్ట్ జి.ఎం. ఖాన్ మద్దతుతో ఆయన కార్మిక నాయకుడిగా ఎదిగారు.

కమ్యూనిస్టు పార్టీపై ఉన్న అభిమానంతో నర్రా రాఘవ రెడ్డి 1950 లో భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ)లో చేశారు. 1959 నుండి 1967 వరకు వట్టిమర్తి గ్రామం సర్పంచ్‌గా ప్రజాసేవ చేశారు. ఆ సమయంలోనే నార్కట్ పల్లి నానాబ్లాక్ జిల్లా పరిషత్ సభ్యునిగా పనిచేశారు. సి.పి.ఐ.లో చీలిక సంభవించిన తర్వాత రావినారాయణారెడ్డి మరియు ధర్మబిక్షంల ప్రభావంతో ఆయన సి.పి.ఎం పార్టీలో చేరారు.

నర్రా రాఘవ రెడ్డి నిబద్ధత క్రమశిక్షణను, గమనించిన పార్టీ ఆయనకు 1967 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుండి పోటీ చేయడానికి టికెట్ ఇచ్చింది. ఆ రకంగా నర్రా రాఘవ రెడ్డి 1967 ఎన్నికల నుండి ఆయన నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి తొలిసారి శాసన సభ్యుడుగా ఎన్నికయ్యారు. ప్రజా బలం మెండుగా ఉన్న ఆయన కేవలం మూడు వందల రూపాయల ఖర్చుతో శాసన సభ్యుడుగా గెలుపొందడం అరుదైన విషయం.

వరంగల్‌లో 1971 లో జరిగిన పార్టీ సమావేశంలో నర్రా రాఘవ రెడ్డి సి.పి.ఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జైలులో పెట్టిన కమ్యూనిస్టు నాయకులలో నర్రా రాఘవరెడ్డి కూడా ఒకరుగా ఉన్నారు. ఆయన 1967 లోనూ మరియు 1975 లోనూ మొత్తంగా నాలుగు సంవత్సరాల పాటు జైలు జీవితాన్ని గడిపారు.

నర్రా రాఘవ రెడ్డి ప్రజా హృదయాలలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకొని 1978, 1984, 1989, 1994 మరియు 1999 సంవత్సరాలలో కూడా ఆ నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసన సభ్యుడుగా ఎన్నికై సరికొత్త చరిత్ర సృష్టించారు. అలా 1972 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల్లో మినహా 1967 నుండి 1999 దాకా మొత్తంగా ఆరు పర్యాయాలు శాసన సభ్యుడుగా ఎన్నికై నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని 'కమ్యూనిస్టు కంచుకోట'గా తీర్చిదిద్దడంలో నర్రా రాఘవ రెడ్డి నిరుపమాన కృషి చేశారు.

శాసన సభ్యుడుగా నర్రా రాఘవ రెడ్డి అనేక ప్రజా సమస్యలపై అవిశ్రాంతంగా ఉద్యమించారు. ఆయన అసెంబ్లీలో పార్టీ ఫ్లోర్ లీడర్‌గాను బాధ్యతలు నిర్వహించారు. ముఖ్యంగా ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రతిపక్ష నాయకుడుగా పార్టీ వాణిని బలంగా వినిపించారు. నిఖార్సైన శాసనసభ్యుడిగా ప్రజాసేవలో అలుపెరుగకుండా కృషిచేసినందుకు గాను ఆయనకు 'ఉత్తమ శాసన సభ్యుడు' అనే అవార్డును లోక్ సత్తా పార్టీ ప్రదానం చేసింది.

శాసన సభ్యుడిగా తనకు లభించే జీతభత్యాల గురించి నర్రా రాఘవ రెడ్డి ఏనాడు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. కాని 'శాసన సభ్యుడు' అనే దానిని గౌరవప్రదమైన, బాధ్యతాయుతమైన పదవిగా ఆయన భావించారు. 'కార్యకర్తలు ఏదో ఒకటి ఆశించకుండా పనిచేసే పరిస్థితి లేకుండా పోయింది' అని నర్రా రాఘవ రెడ్డి ఆవేదన చెందారు. 'ప్రజలతో సంబంధాలు పెరగాలంటే నాయకులు గ్రామాల్లోనే ఉండాలి' ఆయన హితవు పలకడం గమనార్హం.

తన ఏడు దశాబ్దాల కమ్యూనిస్టు రాజకీయ ప్రస్థానంలో నర్రా రాఘవ రెడ్డి నిజాయితీకి నిలువుటద్దంలా నిలిచారు. ప్రజా సంక్షేమం పట్ల అంకితభావానికి ఆయన నిదర్శనంగా నిలిచారు. భావి కమ్యూనిస్టులు నర్రా రాఘవ రెడ్డి బాటలో ఆదర్శప్రాయంగా ముందుకు సాగాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అలుపెరుగని పోరాటయోధుడుగా, రాజనీతి దురంధరుడుగా, వివాదరహితుడుగా పేరుగాంచిన నర్రా రాఘవ రెడ్డి 2015, ఏప్రిల్ 9 నాడు 91 ఏళ్ల వయసులో అనారోగ్యంతో మరణించిననూ 'ఆదర్శ కమ్యూనిస్టు'గా వెలుగొందుతూనే ఉన్నారు.

**( ఏప్రిల్ 9 నర్రా రాఘవ రెడ్డి 11 వ వర్ధంతి )**

**-డాక్టర్ బండి కళ్యాణి**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 10.04.2026
www.mudranews.in | @mudranews
5
దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar

జుట్టు సంరక్షణకు..
ఆలివ్ ఆయిల్ + బాదం నూనెజుట్టుకు మెరుపు, మృదుత్వం ఇస్తుంది.కుదుళ్లను బలంగా మారుస్తుంది.


## సంక్షిప్తంగా..

### ట్రాన్స్‌జెండర్ల ధర్నా



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ట్రాన్స్‌జెండర్ల హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాన్స్‌జెండర్లు భారీ ధర్నా నిర్వహించారు. తమ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టాల్లో తగిన మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

### రెండో రోజుకు ఆర్టిజన్ల సమ్మె



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరుకుంది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఆందోళనలో దాదాపు 2 వేల మందికి పైగా ఆర్టిజన్లు పాల్గొన్నారు. ఆర్టిజన్, స్పాట్ బిల్లర్, పీస్ రేట్, అన్‌మ్యాన్ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. విద్యుత్ కార్మిక సంఘాల 9 జేఏసీ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరుగుతోంది. ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని, ఇతర కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యత



**ముద్ర హైదరాబాద్ :** తెలంగాణ నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పనులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయడం అత్యంత కీలకమని బి. సీనయ్య సూచించారు. రాష్ట్రంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర, సెంటర్ చైర్మన్ల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా పాల్గొన్న ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ వి. సత్య మూర్తి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా వి. రవీందర్ రెడ్డి, 20మంది సెంటర్ చైర్మన్లను ప్రతిష్టాపన చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా మాజీ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ వైస్ ప్రెసిడెంట్లు ఎన్. సచితానంద రెడ్డి, డీవీఎన్ రెడ్డి, అలాగే మాజీ రాష్ట్ర చైర్మన్లు యు. సురేందర్, కె. దేవేందర్ రెడ్డి, వి. భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈవెంట్ చైర్మన్‌గా వి. సుధాకర్, కో-చైర్మన్‌గా ఎస్. శ్రీనివాస్ రావు వ్యవహరించారు.

### ఖర్గేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**ముద్ర, తాండూర్:** అస్సాంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులను చంపేయండి అంటూ ముస్లింలను రెచ్చగొడుతూ ప్రసంగించిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కర్గే పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాండూర్ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా తాండూర్ బీజేపీ నాయకులు పట్టణ సిఐకి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ హిందువులపై ఎంత ద్వేసంగా ఉన్నారో గమనించాలన్నారు. హిందూ సంస్థలను దూషించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీలత, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, మైనార్టీ మోర్చా అధ్యక్షులు షాబుద్దీన్, తాండూర్ కౌన్సిలర్లు మల్లేశం, కిరణ్, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సంగమేశ్వర్, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.ర

# మెడికల్ హబ్ గా గద్వాల

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** గద్వాల పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇండ్ల సమీపంలో జిల్లా ఆసుపత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ భవనాలు నిర్మించడంతో ఈ ప్రాంతం మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందబోతోందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాల శివారులో రూ. 5.7 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇందిర మహిళా శక్తి భవనంతో పాటు పక్కనే కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే మెడికల్, నర్సింగ్ కళాశాలల భవనాలు, రెండు పడక గదుల ఇండ్ల సముదాయంను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భవనంలో నిర్మిస్తున్న డార్మెటరీ హాల్స్, ఓపెన్ డైనింగ్, కిచెన్, తదితర గదులను తిరిగి పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధులకై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కావలసి ఉండడంతో రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ డిజైన్ పూర్తయితే ప్రతిపాదిత స్థలం వద్ద రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయవచ్చన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభించాల్సి ఉన్నందున భవన నిర్మాణం పూర్తయ్యే వరకు గోనుపాడు గ్రామం వద్ద ఉన్న గద్వాల మండల కస్తూరిబా విద్యాలయ భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ సమీపంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల భవనంలో కస్తూర్బా విద్యాలయ నిర్వహణకు పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం సమీపంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న మెడికల్ కళాశాలను సందర్శించారు. విద్యార్థుల, సిబ్బంది హాజరు నివేదికను ఎప్పటికప్పుడు తమకు పంపాలని ఆదేశించారు. అనంతరం మెడిసిన్ విద్యార్థులకు తరగతి గదిలో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలను కలెక్టర్ కాసేపు



కూర్చుని పరిశీలించారు. ప్రస్తుత భవనం ముందు రూ.140 కోట్ల అంచనా తో నిర్మించే మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మెడిసిన్ విద్యార్థులు తమ సమస్యలపై కలెక్టర్ కు వినతిపత్రాలు ఇవ్వగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అలాగే పక్కనే రూ.12 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నర్సింగ్ కళాశాల అకాడమిక్, వసతి గృహ భవనాల నిర్మాణ పనులు మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కళాశాల భవనంలో వివిధ విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం సమీపంలోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ భవనాన్ని సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలకు ఇక్కడి నుంచే మందులను, ఇతర మెడికల్ సామాగ్రిని సరఫరా చేస్తున్నందున తగు సూచనలు చేశారు.చివరగా రెండు పడక గదుల ఇండ్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. డిప్పు విధానంలో రెండు పడక గదుల ఇండ్లను కేటాయించబడ్డ అర్హులైన లబ్ధిదారులే నివాసం ఉండాలని,



అద్దెకు ఇవ్వడం, అమ్ముకోవడం వంటివి చేస్తే కేటాయింపు రద్దుచేసి ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆ ఇండ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండు పడక గదుల ఇండ్ల సముదాయం వద్ద నీటి సమస్యను పలువురు లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రింగ్ రోడ్డు సమీపంలో మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో రెండు పడక గదుల సముదాయం నిర్మించడంతో ఈ ప్రాంతానికి భవిష్యత్తులో ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇలాంటి విలువైన ప్రదేశంలో నిర్మించిన రెండు పడక గదుల ఇండ్లను వినియోగించుకోకుండా దుర్వినియోగం చేయడం తగదన్నారు. లబ్ధిదారులకు ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని, నివసించకుండా ఉన్నవాళ్లు నెల రోజుల్లోగా గృహప్రవేశాలు చేసుకోవాలని లేదంటే వారికి కేటాయించిన ఇండ్లను ఇతర అర్హులైన వారికి కేటాయింపు చేయడం జరుగుతుందని అన్నారు.ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, డిఈ లక్ష్మన్న, డీఈవో విజయలక్ష్మి, టిజి ఎంఎస్ఐడిసి డిఈ శ్రీనివాసులు, ఏఈ రహీం, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు ఇందిర, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతమ్మ, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ వద్దు



**ముద్ర, కాప్రా:** చర్లపల్లి ఈసీ నగర్ కాలనీలో కమ్యూనిటీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని కాలనీ వాసులు ధర్నాతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మధ్యలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావంతో అనారోగ్య సమస్యలు పెరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సమీపంలో పార్క్ ఉండటంతో అక్కడికి వచ్చే వృద్ధులు, చిన్నారులు రేడియేషన్ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, గర్భిణీ స్త్రీలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వారు వివరించారు. వెంటనే పనులను నిలిపివేసి టవర్‌ను తొలగించాలని కోరారు. లేకపోతే నిరసనలను మరింత ఉధృతం చేసి పెద్ద ఎత్తున రహదారి నిరోధాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కడియాల జనార్దన్, లక్ష్మారెడ్డి, కడియాల రాకేష్, కొమ్ము రమేష్, ఫ్రాంచెస్, మొగులయ్య, సురేష్, కడియాల ప్రణయ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు

**-రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇసుక తవ్వకాల అనుమతులు, రవాణా, ప్రభుత్వ ఆదాయం పెంపు, అక్రమ తవ్వకాల నియంత్రణపై సమగ్రంగా చర్చించి



స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇసుక బుకింగ్ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో "మన ఇసుక వాహనం" యాప్ ద్వారానే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫ్‌లైన్ బుకింగ్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాల దరఖాస్తులను పర్యావరణ అనుమతుల ఆధారంగా పరిశీలించి, తెలంగాణ మినరల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే రవాణా జరగాలని సూచించారు. ఇసుక తరలింపుకు దరఖాస్తు చేసిన వాహనాల ద్వారానే రవాణా జరగాలని, వాహనాల వివరాలు, డ్రైవర్ లైసెన్స్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలు లేదా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తితే పోలీస్ శాఖ సహాయం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, నీటి పారుదల శాఖ అధికారి మురళి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, భూగర్భ జల శాఖ అధికారి దివ్య జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

# అవగాహనతో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఎయిడ్స్ వ్యాధి సంక్రమించకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎయిడ్స్ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఏఆర్ టీ చికిత్స తీసుకుంటే వైరస్ నియంత్రించడంలో సహాయపడుతుందన్నారు. అలాగే సకారాత్మక జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు ఇందిర, ప్రోగ్రాం అధికారి రాజు, ఇతర వైద్యాధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు




పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్‌లో..**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా నాగర్ కర్నూల్లోని పాత కలెక్టరేట్ ఆవరణలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ రవికుమార్ ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీని జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సమావేశంలో హెచ్ఐవి నివారణపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఆసుపత్రిలోని మైత్రి క్లినిక్‌లో 10





మంది ట్రాన్స్‌జెండర్లకు, జిల్లా సబ్ జైల్లో ఉన్న 6 మంది ఖైదీలకు ఆరోగ్య పతతరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ రఫీక్, డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ వాణి, డాక్టర్ సృజన, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, దిశా సిపిఎం రమేష్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్యాస్ సరఫరా, వినియోగంపై అధికారులతో కలిసి సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి నరసింహారావు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వంట గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖతో సమన్వయం పెంచాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమంగా వినియోగించే సిలిండర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గృహ వినియోగానికి కేటాయించిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తే డీలర్లపై లైసెన్స్ రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి లోటు లేదని, తగిన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి అక్రమాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అన్నదానం



**ముద్ర, తాండూర్:** తాండూర్ పట్టణంలోని బావిగిభద్రేశ్వరుని జాతర మహోత్సవంలో నిత్య అన్నదానం కార్యక్రమంలో భాగంగా గురువారం భద్రేశ్వర దేవాలయంలో బీవీజీ ఫౌండేషన్ చైర్ పర్సన్ సునీత సంపత్ దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో జాతర మహోత్సవ ఫెస్టివల్ చైర్మన్ మహేష్, కమిటీ సభ్యులు, వీరశైవ సమాజం పెద్దలు, అక్కమా దేవి భజన మండలి మహిళల సభ్యులు, వీరశైవ యువదల్ సభ్యులు పాల్గొని సన్మానించారు.

## క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



**ముద్ర, శేరిలింగంపల్లి:** కొండాపూర్ జిల్లా ఆసుపత్రి ఆవరణలో వంద పడకల క్రిటికల్ కేర్ విభాగం భవనం నిర్మాణం పనులకు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా, డీఎంఅండ్ హెచ్ వో లలితా దేవి, రాజేంద్ర నగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, తహసీలార్ మహిపాల్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, నార్నె శ్రీనివాసరావు, పీయేసీ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. అనంతరం డయాగ్నస్టిక్స్ హబ్‌ను సందర్శించారు. వైద్య సేవలు, ల్యాబ్ టెస్టులు, తదితర అంశాలపై పేషెంట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర వైద్య చికిత్సకు అవసరయ్యే నాణ్యమైన వైద్యం అందించే దిశగా ముందడుగు వేస్తున్నామన్నారు.

## డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం




**ముద్ర కూకట్‌పల్లి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ద్వారానే జీవితాల్లో వెలుగులు నిండుతాయని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన మరిన్ని నిధులు, అదనపు గదుల నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తామనీ హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు ల్యాప్ టాప్లు, అంగన్ వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఇద్దరికి ఎస్పీ అభినందనలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా లో ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఇద్దరికి ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్టార్స్ అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. సిద్దాపూర్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నరసింహారెడ్డి, పెంట్లవెల్లిలో ఏఎస్ఐగా పనిచేస్తున్న అబ్దుల్ ఖయ్యూం ఎస్సైగా ప్రమోషన్ పొందారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా సేవలందించినప్పుడే ప్రజల్లో పోలీసులపై గౌరవం, విశ్వాసం పెరుగుతుందన్నారు. పదోన్నతి అనేది కేవలం ఉన్నత హోదా మాత్రమే కాకుండా, మరింత బాధ్యత పెంచుతుందన్నారు.

## ఇన్నోమాటిక్స్‌లో అవగాహన సదస్సు

**ముద్ర, కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ స్థానిక ఇన్నోమాటిక్స్ రీసెర్చ్ ల్యాబ్‌లో కేపీహెచ్‌బీ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మరియు మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీఐ రవి మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతమైందని ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, నిర్వాహకులు తెలిపారు.

## ఆసుపత్రి ప్రారంభోత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం తెలకపల్లి మండల కేంద్రంలో నిర్మించిన భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డిఎంహెచ్వో డాక్టర్ రవినాయక్, వైద్యులు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల మద్దతుతో పార్టీని బలోపేతం చేయాలి

**ముద్ర, శేరిలింగంపల్లి:** పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మసీద్ బండ బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజిత్, రవీందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రె నాయకులు నరేష్ పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి. అశోక్ కురుమ, రవీందర్ రావు, బుచ్చిరెడ్డి, వసంత్ యాదవ్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 10.04.2026
www.mudranews.in | @mudranews



జుట్టు సంరక్షణకు
ఆలివ్ ఆయిల్ + రోజ్ మేరీ ఆయిల్
రక్తప్రసరణ పెంచు తుంది. జుట్టు పెరుగుదల ను వేగవంతం చేస్తుంది.


# ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించాలి

**- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం వెల్గటూర్ మండలంలోని స్తంభంపెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైనా ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించుకునే ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు అందజేస్తుందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ పై ధరల నియంత్రణ కోసం కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. గడువులోపు వారికి కేటాయించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పరిణామంలో ఇండ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు మేస్త్రీలు, కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకేపీ, సహకార సంఘాల ద్వారా రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. బిల్లులను దశలవారీగా నేరుగా ఆధార్ లింక్ చేయబడ్డ లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పలు మార్కింగ్, బెస్మెంట్, స్లాబ్ లెవెల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేసుకోవాలని కోరారు.

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రతి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కుమార్ పల్లిలోని మోడల్ స్కూల్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, స్థానిక సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం




**ముద్ర, కరీంనగర్:** అందరం కలిసి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దామని, కరీంనగర్ జిల్లాను ఇందులో ఆదర్శంగా నిలుపుదామని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, యువత, తల్లిదండ్రులు సమష్టిగా మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వివిధ శాఖల అధికా రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు జిల్లాలో సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో డ్రగ్స్ వాడకంపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. వైద్యుల చీటీ లేకుండా మత్తు కలిగించే మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలలను సందర్శించి కేవలం డ్రగ్స్ పైనే కాకుండా మద్యపానం, ధూమపానం అనర్థాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. జిల్లాలో అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని పోలీస్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో జిల్లా అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేద్దామ న్నారు.

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఎక్కడికక్కడ ఉక్కు పాదం మోపుతున్నామని కఠినంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, అమ్మకం తదితర అంశాల్లో ఇటీవల ఐదు కేసులు నమోదు చేశామన్నారు. పదిమందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. పాఠశాలలు విద్యాసంస్థలకు దగ్గర్లో పాన్ షాపులు సిగరెట్ షాపులు ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ ఓ వెంకటరమణ, ఆర్డీ వోలు కే మహేశ్వర రమేష్ బాబు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, యాంటీ నార్కోటిక్స్ టీం ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన సంబంధిత అధి కారులతో ఎన్ఎంఆర్ వేజెస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా దినసరి కార్మికుల చేతనాల పెంపు గురించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం ద్వారా వారిని గౌరవించినట్లవుతుందని పేర్కొన్నారు. కార్మికులకు సంబంధిత వేతనాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజలింగు, సీపీఓ జీవరత్నం, డీఆర్డీఓ విజయలక్ష్మి , జెడ్పీ సీఈవో శంకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బీ సుభాష్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టెండర్లు రద్దు చేయొద్దు

**- బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ పట్టణాభివృద్ధికి మంజూరైన రూ.15 కోట్ల నిధుల టెండర్లను రద్దును నిరసిస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కృషి ఫలితంగానే నిర్మల్ పట్టణాన్ని అమృత్ పథకంలో చేర్చారని గుర్తు చేశారు. ఈ మేరకే పట్టణంలో తాగు నీటి సౌకర్యానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమృత్ పథకం కింద మొదటగా 62.50 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అలాగే మురికి నీటి శుద్ధి కోసం సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.42 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. పట్టణ అభివృద్ధికి అత్యవరంగా రూ.50 కోట్లు అవసరమని ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే, రూ. 15 కోట్లు మంజూరు చేశారన్నారు. కాగా మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని అడ్డుకునేలా తీసుకున్న ఈ టెండర్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోపోతే నిరసన చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత రావుల రామ్ నాథ్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, జిల్లా ఉపా ధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, సీనియర్ నాయకులు మెడిసెమ్మ రాజు, బీజేపీ కౌన్సి లర్లు సాదం అరవింద్, గంజి రాజు, శ్రీరా మోజీ నరేష్, శాం శంక్, సురేందర్, జింక సూరి, సాత్విక్, సూరజ్ నాయక్, విఠల్, కృష్ణ మోహన్, ముత్యం, ఈశ్వర్ పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్



**ముద్ర, కరీంనగర్:** నగరంలోని గాంధీ నగర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల బ్లాక్ లను గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు.ఇండ్లకు సంబంధించిన పెండింగ్ పనులు ఏమేమి ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బ్యాలెన్స్ వర్క్స్ సత్వరమే పూర్తి చేసి ఇండ్లను సిద్ధం చేసి ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులపై ఆర్ అండ్ బీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. బ్లాక్ ల వారీగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అన్ని రకాలుగా సంసిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహ చారి, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోల్ షిఫ్టింగ్ పనులు వేగవంతం చేయాలి

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



**ముద్ర, కరీంనగర్:** కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్లైన్ రోడ్డు నిర్మించనున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, లైన్ల షిఫ్టింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో కలెక్టర్ ఈ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యుత్, రోడ్లు–భవనాల శాఖ అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పిడి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా పనులు నిర్వహించాలన్నారు. ఆర్డీవో మహే శ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జగదీ శ్వర్, ఆర్ అండ్ బీ ఈ నరసింహచారి పాల్గొన్నారు.

## రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు చేయాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఆదివాసీల సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించేలా నిర్మల్‌లో రాంజీ గోండ్ మ్యూజియం ఏర్పాటు చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ జేఏసీ జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రాంజీ గోండ్ వర్ధంతిని నిర్వహించారు. రాంజీ గోండ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ నిర్మల్ గడ్డపై రాంజీ గోండ్ సాగించిన పోరాటం అజరామరమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మంద మల్లేష్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి తోడసం గోవర్ధన్, జిల్లా మాజీ అధ్యక్షుడు మొసలి చిన్నయ్య, కార్యదర్శి, మాజీ సర్పంచ్ సూరత్ సాయన్న, బోసాని రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రాంజీ గోండు త్యాగం మరువలేనిది




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాంజీ గోండు త్యాగం మరువలేనిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ అన్నారు. గురువారం బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలో రాంజీ గోండు వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని చైన్ గేట్ లో గల రాంజీ గోండు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రితీష్ రాథోడ్ మాట్లాడుతూ నిర్మల్ గడ్డపై నిజాం కు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన వెయ్యి మంది వీరులను స్మరించు కోవాలన్నారు. రాంజీ గోండు ఏక కాలంలో అంగ్లేయులు, నైజాం పాలకులతో పోరాటం సాగిం రన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, మేడిసిమ్మే రాజు, జిల్లా కార్యదర్శి అల్లం భాస్కర్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, సీనియర్ నాయకులు అయ్యన్నగారి రాజేందర్, కందుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తోనే సొంతింటి కల సాకారం




**బోథ్, ముద్ర:** కాంగ్రెస్ తోనే సొంతింటి కల సాకారం అవుతుందని బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ తెలిపారు. గురువారం బోథ్ లోని సాయి నగర్ కు చెందిన కుమురం రేణుక ఇందిరమ్మ ఇల్లును ఉప సర్పంచ్ విజయ రెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ సోయం బాపురావు, నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ల సహకారం ఎంతో కీలకమన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని చెప్పారు. ప్రజా పాలనలో భాగంగా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
10.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



జుట్టు సంరక్షణకు
ఆలివ్ ఆయిల్ + భృంగరాజ్ ఆయిల్ జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.సహజ రంగును కాపాడుతుంది.





## మెనూ ప్రకారం ఆహారం అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో అందిస్తున్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదులను, డార్మెటరీ హాల్ తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ.. ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని పరిసర ప్రాంతాలు పరిశీలిస్తూ పరిసరాలు, తాగునీరు, మరుగు దొడ్లు, మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే విద్యార్థులలో పాఠ్యాంశాలపై అవగాహన పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు.



## నిజాయితీకి నిలువుటద్దం నర్రా

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ముద్ర, చిట్యాల:** నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా, ప్రజలకు నిస్వార్థ సేవలందించిన ప్రజానాయకుడు నర్రా రాఘవరెడ్డి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో జరిపిన అమరజీవి నర్రా రాఘవరెడ్డి 11వ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల పక్షపాతిగా అసెంబ్లీలో తమ వాణి పాలకులకు వినిపించిన రాఘవరెడ్డి లాంటి నాయకులు కరువైనారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా సాగు తాగు నీటి కోసం పట్టుబట్టి యస్ యల్ బి సి నీటిని రప్పించిన ఘనత సిపిఎం శాసన సభ్యులకు, నర్రా రాఘవరెడ్డి కి ఉందని చెప్పారు. నకిరేకల్ నియోజకవర్గం తో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసి, మాతో పనిచేయించిన ఆయన జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయం అని అన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పార్టీ జెండాను జూలకంటి రంగారెడ్డి ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,నారీ ఐలయ్య, జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ,మల్లం మహేష్, పెంజర్ల సైదులు, చింతపల్లి బయ్యన్న, మండల పార్టీ నాయకులు రాచకొండ శ్యాం సుందర్, శీలా రాజయ్య, అరూరి శ్రీను, ఐతరాజు నర్సింహా, యాదయ్య, కల్లూరి కుమార స్వామి, మెట్టు నర్సిం హా, పంది నరేష్, జిట్ట స్వామి,అక్కెనపల్లి నాగయ్య వివిధ ప్రజా సంఘాల నాయ కులు నర్రా కిశోర్,పాలమాకుల అర్జున్, చింతపల్లి క్రిష్ణయ్య, బూరుగు విజయ్, శ్రీను, నర్రా శేఖర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రమేష్, బాబురావు,యాదయ్య పాల్గొన్నారు.



## కాంగ్రెస్ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే మందుల సామేల్

**ముద్ర, తుంగతుర్తి:** కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, ఏఐసీసీ సభ్యులు రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో మల్లన్న గుట్ట వద్ద రూ.15 కోట్ల వ్యయంతో పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించనున్న గోదాంలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండేలా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేష్ కుమార్, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, గ్రామ సర్పంచ్ సోలిపురం అశ్విని, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు యోగానంద చారి, రేగటి రవి, గిడ్డంగుల సంస్థ డీఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరునికి తిరుప్పావడ సేవ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి దివ్య క్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారికి గురువారం తిరుప్పావడ సేవ ఘనంగా నిర్వహించారు. సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారని ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు తెలిపారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుంద ని అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ, తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారని చెప్పారు. వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. స్వామి వారికి ప్రాతఃకాలంలో



అర్చక స్వాములు సుప్రభాత సేవను భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని భక్తులకు కల్పించారు.



## నీటి సమస్య పరిష్కారం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బోరు మోటార్లు పెట్టించి వార్డులో నీటి సమస్య తీర్చారు. మునిసిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణికి 2మోటార్లు కావాలని కోరగా గురువారం మునిసిపల్ సాధారణ నిధుల నుండి సుమారు రూ.60 వేలతో ఇందిరానగర్, న్యూ రామ్ నగర్ మధ్యలో ఒక మోటారు బిగించి నీళ్లు వదలడం జరిగిందన్నారు. దీనితో వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ.., కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్, మునిసిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.



## ఘనంగా ఎన్ ఎస్ యుఐ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** 56 వ ఎన్ ఎస్ యు ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు నోముల తరుణ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ లో పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళపెల్లి శ్రీవాణి రవికుమార్ విచ్చేసి మాట్లాడుతు విద్యారంగంలో పారదర్శకత, సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చేయడం ఎన్ఎస్‌యూఐ ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోందన్నారు. విద్యార్థుల ఫీజు సమస్యలు, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై ఉద్యమాలు చేపడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు నోముల కమల్, జానకి రామ్, రాకేష్, ఆకాష్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్ పై రెడ్ రిబ్బన్ అవగాహన ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహిస్తున్న హెల్త్ వీక్ డే–4 గురువారం హెచ్ఐవి, ఎయిడ్స్ పై రెడ్ రిబ్బన్ అవగాహన ర్యాలీని పట్టణంలో మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి నుండి జగదేవ్‌పూర్ చౌరస్తా వరకు నినాదాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి




ఒక్కరు ఎయిడ్స్ వ్యాధిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఐవి వైరస్ శరీరంలోని రోగనిరోధక శక్తిని తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వంశీ కృష్ణ, విజయ్ పటేల్, ప్రీతీ స్వరూప్, సాగరిక, డేవిడ్ , శైలజ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్, భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, లావుడియ రాజు మాట్లాడుతూ ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు పేద విద్యార్థుల చదువులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదాన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. భువనగిరిలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఏయిడెడ్ కళాశాల ఉండగా ఈ కళాశాలను ప్రభుత్వమే తన ఆధీనంలో తీసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఇర్ల రాహుల్, తీగుళ్ల శ్రీనివాస్, దరావత్ జగన్నాథ్, పుట్టల ఉదయ్, జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల కార్తీక్, బుగ్గ ఉదయ్, మైసూర్ల నరేందర్ దాసరి ప్రకాష్, ప్రవీణ్, రోహిత్, ఉదయ్, చరణ్, శివ, అరవింద్, శివ, సాయి పాల్గొన్నారు.




# రెగ్యులర్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

- సీఐటీయూ డిమాండ్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు, ఇతర పేర్లతో పనిచేస్తున్న కార్మికులందరికీ రెగ్యులర్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటి రెడ్డి చంద్రా రెడ్డి, కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఆఫీసులో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజున సీఐటీయూ తరపున సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నాడు టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అప్పటివరకు సబ్‌స్టేషన్ ఆపరేటర్స్ గా పనిచేస్తున్న వారిని ఆర్టిజన్ వర్కర్ గా పేరు మార్చుతూ గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3, గ్రేడ్ 4 లుగా విభజించి




తరతమ తేడాలతో వేతనాలు చెల్లిస్తూ ప్రభుత్వం వీరితో వెట్టి చేయించుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ భువనగిరి డివిజన్ చైర్మన్ ఇంజ మహేష్, కన్వీనర్ బొట్ల రమేష్, కో కన్వీనర్ ఎడ్ల వెంకటేష్, రాష్ట్ర కంపెనీ కో కన్వీనర్ పాండరిరెడ్డి, వైస్ చైర్మన్లు సాగిన రమేష్, బొట్ల నర్సింగరావు, పిసీఏలు, పిఏలు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఎన్పీఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్

**ముద్ర, మోత్కూర్:** వికలాంగులకు సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించి, రూ.6వేలు పెన్షన్ వెంటేనే అమలు చేయాలని ఎన్ పిఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మోత్కూర్ మండల కేంద్రంలో ఎన్ పి ఆర్ డి పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... గతంలో ఎన్నికల ముందు హామీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. వికలాంగులకు పరికరాలు ఇస్తామని ఇప్పటికీ మూడు దఫాలో అప్లికేషన్ పెట్టుకున్నా ఏ ఒక్కరికి బడ్జెట్ లేదని పరికరాలు పంపిణీ చేసే పరిస్థితి లేదని, వికలాంగులకు ఉపాధి అవకాశాల్లో రుణాలు ఇస్తామని ఇప్పటికీ బ్యాంకు ద్వారా ఏ




మాత్రం రుణం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రూ.10 లక్షలు రుణం వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ పి ఆర్ డి ఎన్ పి ఆర్ డి డివిజన్ ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి, మోత్కూరు మండల అధ్యక్షులు ఎర్రవెల్లి నాగేష్, టౌన్ అధ్యక్షులు గౌలికర్ రాజు, మున్సిపాలిటీ అధ్యక్షులు గుండు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, అప్పల యాదగిరి, వెంకటేష్, మహిళా కన్వీనర్ మంజుల, గౌడిశాల యాదగిరి, చేతరాశి రమేశ్, జయ భిక్షం, ఎండి జమాల్, ఎస్.కె కాశీం పాల్గొన్నారు.

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి

**ముద్ర, బీబీనగర్ :** బీబీనగర్ మండలం రాయరావుపేట గ్రామంలోని ఇళ్లు లేని పేదలందరికీ సర్వే నెం. 178లో స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నెంబర్ 178 లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో ఇదే స్థలంలో ఇల్లు లేని పేదలతో గుడిసెలు వేశామని అట్టి గుడిసెలను అప్పటి తహసిల్దార్ పోలీసుల సహకారంతో తొలగించారని అన్నారు. అధికారుల చర్యలను నిరసిస్తూ తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాలు నిర్వహించి అధికారులతో చర్చలు జరిపిన సందర్భంగా అప్పుడు ఆర్డిఓ కృష్ణారెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మాణం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బండారు శ్రవణ్ కుమార్, సీనియర్ నాయకులు గాడి శ్రీనివాస్, పోరుబోతుల జంగయ్య, గాడి చిన్న శ్రీనివాస్, గడ్డమీది కృష్ణ, రొంపి కౌసల్య, ఎరుకల జయమ్మ, ఉప్పరి వెంకటరెడ్డి, సోను, ధనేశ్వరి, మకర్ పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



జుట్టు సంరక్షణకు వారానికి 2–3 సార్లు ఆయిల్ మసాజ్
స్కాల్ప్ ఆరోగ్యంగా ఉంటుంది. హెయిర్ గ్రోత్ మెరుగు పడుతుంది.



# అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

- **ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యమని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై 'రెడ్ రన్' ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత, డీసీహెచ్ఎస్ డా. శివదయాల్, నర్సింగ్ కాలేజ్ బాలికలు పాల్గొన్నారు. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రాందాస్ చౌరస్తా వరకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ ఒక నివారించలేని వ్యాధి అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్తం, వాడిన సిరంజీల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సురక్షిత పద్ధతులను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో 385 హెచ్ఐవీ/ఎయిడ్స్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. రాందాస్ చౌరస్తాలో అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయితే తగు జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవచ్చన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో, పట్టణాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని వ్యాధి గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్జీఓలు తదితరులు పాల్గొన్నారు.







## నాగాపూర్‌లో జల మహోత్సవ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

సంగారెడ్డి మండల పరిధిలోని నాగాపూర్ గ్రామంలో సర్పంచ్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఇంటింటికి మంచినీరు" కార్యక్రమంలో భాగంగా, పంచాయతీ కార్యదర్శి జగన్ నిర్వహణలో, మిషన్ భగీరథ అధికారుల ఆధ్వర్యంలో జల మహోత్సవ ర్యాలీని గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. అందరికీ ఆరోగ్యాన్ని అందించే మంచినీటిని ఎలా సరఫరా చేయాలో వివరించారు. మంచినీటికి సంబంధించిన అన్ని విషయాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రకాష్ రావ్, వార్డు సభ్యులతో మిషన్ భగీరథ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముకురాల అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రకాష్ రావ్, పంచాయతీ కార్యదర్శి జగన్, మిషన్ భగీరథ డీఈ హరీష్, ఏఈ వెంకటేష్, వార్డు సభ్యులు చింతల కీర్తన, కట్కం భాగ్యమ్మ, కాశీపురం విజయలక్ష్మి, శ్యామల, కట్కం మధు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో యుద్ధోన్మాద వ్యతిరేక ర్యాలీ

- **ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో భారీ నిరసన**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ, ప్రపంచ శాంతిని కోరుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సిద్దిపేటలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ సిద్దిపేట హైస్కూల్ గ్రౌండ్ నుండి ప్రారంభమై కాంచిట్ చౌరస్తా, విక్టరీ టాకీస్ చౌరస్తా మీదుగా ప్రధాన రహదారి ద్వారా పాత బస్ స్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ర్యాలీ దారి పొడవునా అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం సర్కిల్ వద్ద వివిధ సంఘాల ప్రతినిధులు రంగాచారి, పాపయ్య మాట్లాడుతూ ప్రపంచ పోలీసుగా మారిన అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయిస్తూ, వనరులను దోపిడీ చేయడం కోసం యుద్ధాలను ప్రేరేపిస్తోందని విమర్శించారు. ఆయుధాల వ్యాపారాన్ని విస్తరించేందుకు వివిధ దేశాల మధ్య యుద్ధాలు సృష్టిస్తూ మానవ హననానికి పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజల జీవించే హక్కును కాలరాస్తోందని, సామ్రాజ్యవాద విస్తరణ కాంక్షతో సాగుతున్న ఈ యుద్ధాల వల్ల ప్రపంచ దేశాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్, లెబనాన్ దేశాల్లో వేలాది మంది అమాయకులు మృతి చెందారని తెలిపారు. అమెరికా యుద్ధ కాంక్ష ఒక దేశంతో ఆగిపోదని, భవిష్యత్తులో మరింత విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అమెరికా యుద్ధోన్మాదాన్ని, ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ చర్యలను మానవతావాదులు, మేధావులు, భారతీయులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో వివిధ సంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి

- **అడిషనల్ కలెక్టర్ పాండు**



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా, గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని అడిషనల్ కలెక్టర్ పాండు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి సమానంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజం ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అవసరమైన పరీక్షలు, చికిత్సలు అందించేందుకు ఇలాంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్, వైద్యులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## గడువు ముగిసిన గోధుమపిండి విక్రయం

- **శాంపిల్స్ సేకరించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జయరాం**

**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట:**

గడువు ముగిసిన గోధుమ పిండి విక్రయించిన సూపర్‌మార్కెట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శాంపిల్ సేకరించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం మెదక్ రోడ్డులోని రిలయన్స్ సూపర్ మార్కెట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జయరాం గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సూపర్‌మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేస్తుండగా గడువు ముగిసిన ఐదు కేజీల గోధుమపిండి ప్యాకెట్ వినియోగదారుడికి నిర్వహకులు విక్రయించినట్లు తెలిపారు. వినియోగదారుడు గడువు ముగిసిన గోధుమపిండి ప్యాకెట్‌ను గుర్తించి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారి తమ సిబ్బందితో కలిసి సూపర్‌మార్కెట్‌లో తనిఖీ చేసి శాంపిల్స్ సేకరించినట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అదేవిదంగా రిలయన్స్ సూపర్‌మార్కెట్‌లో డేట్స్ కర్జూర, నేచురల్ సన్ ఫ్లవర్ ఆయిల్ శాంపిల్స్ సేకరించి సూపర్‌మార్కెట్ నిర్వహకుడికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు. గడువు ముగిసిన వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జయరాం తెలిపారు

# ఆర్టిజన్లను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- **ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి**
- **సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీవీఏఈ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి తెలిపారు. సిద్దిపేటలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన ధర్నాకు మద్దతు తెలుపుతూ ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్ ఆర్థిక సంబంధితది కాదని, ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఆర్టిజన్ కార్మికులు కోరుతున్న కన్వర్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్, ఔట్‌సోర్సింగ్, మీటర్ రీడర్స్, అన్‌మ్యాన్ వర్కర్స్‌కు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్క పాదయాత్ర సమయంలో అధికారంలోకి వస్తే కన్వర్షన్ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటాలకు, సమ్మెకు సీఐటీయూ ప్రత్యక్ష మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ డిమాండ్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, జేఏసీ డివిజన్ చైర్మన్ చిట్కూరు సుధాకర్, నాయకులు గౌటి భాస్కర్, కనకరాజు, విష్ణువర్ధన్, నాగ బైరయ్య, శ్రీనివాస్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

### జోగిపేటలో ఆర్టిజన్ కార్మికులకు బీజేపీ మద్దతు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జోగిపేటలో ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన ఆందోళనకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో వారు చేస్తున్న నిరసనకు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పులుగు గోపాల్ మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని కోరారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు.

## చలివేంద్రాల ఏర్పాటు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సామాజిక సేవ చేయడం అదృష్టంగా భావించాలని, ఇలాంటి కార్యక్రమాలకు యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. దాతలు బిల్డర్ సురోత్తమ్ రెడ్డి, పారిశ్రామిక వేత్త సారా శివకుమార్ ముందుకు రావడంతో, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. చైర్మన్ కృష్ణారెడ్డి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. జోగిపేట పరిసర ప్రాంతాల్లోని సుమారు 50 గ్రామాల నుంచి ప్రజలు వ్యాపార నిమిత్తం పట్టణానికి వస్తుంటారని, వారి దాహాన్ని తీర్చేందుకు ముందుకు వచ్చిన వివేకానంద యువజన సంఘం యువకులను అభినందించారు. తహశీల్దార్ కార్యాలయం ముందు, బాలుర ఉన్నత పాఠశాల, క్రీడా మైదానం వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, మణినాగ్ చంద్ర, సాయి దిలీప్, అఖిల్, డాకూరి సాయి, నాగరాజు, త్రిశాంక్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు యంత్రాల పంపిణీ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు మరొక ముందడుగు పడింది. బేటీ బచావో-బేటీ పడావో పథకం కింద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, కుట్టు యంత్రాల పంపిణీతో పాటు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో పథకం కింద సంగారెడ్డి బాలసదనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయగా, మరో 25 మంది లబ్ధిదారులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ బేటీ బచావో-బేటీ పడావో పథకం ద్వారా కుట్టు యంత్రాల పంపిణీ, బ్యూటీషియన్ శిక్షణలతో మహిళల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళలకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ మాట్లాడుతూ మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారిణి లలితా కుమారి మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ, డిసిపీఓ రత్నం, చిల్డ్రన్ సూపరింటెండెంట్ విజయ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లగూడెం ఉత్సవాలకు ఆహ్వానం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లాలోని గొల్లగూడెంలో నేటి నుంచి ఘనంగా ప్రారంభం కానున్న శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, ఎల్లమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను గొల్లగూడెం కుర్మ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఉత్సవాల విశేషాలను ఎమ్మెల్యేకు వివరించగా, స్పందించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారని తెలిపారు. గ్రామ దేవతల ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పుణ్య కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులు లాడే బాలు (9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి), లాడే మల్లేశం (కౌన్సిలర్), దగొల్ల మల్లేశం, శంకర్, లాడే శేఖర్, లాడే రమేష్, లాడే శ్రీశైలం, లాడే కుమార్, కర్కం మల్లేశం, లాడే వెంకట్, ఇరిగిపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో ఎక్స్ ప్రెస్ డిపో : ఎమ్మెల్యే

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ ఆర్టీసీ డిపోను మోడల్‌గా మార్చడంతో పాటు రామాయంపేట డిపోను ఎక్స్ ప్రెస్ డిపోగా అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. గురువారం మెదక్ డిపోను పరిశీలించిన ఆయన ప్లాట్‌ఫారమ్‌ల విస్తరణ, బస్సులు, డ్రైవర్ల కొరత, పాత బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశపెట్టడంపై అధికారులతో చర్చించారు. రామాయంపేట బస్ స్టాండ్‌లో మరుగుదొడ్ల పునర్నిర్మాణం కూడా చేపట్టనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎం. గంగాధర్, డి. నరేశ్ గౌడ్, మన్సూర్, శివరామకృష్ణ, అవారి చంద్రశేఖర్, రాగి అశోక్, బొజ్జ పవన్, సిద్దిరాములు, మహ్మద్ సమీయుద్దీన్, బాలరాజ్ యాదవ్, సయ్యద్ ఉమర్ మొహియుద్దీన్, మైసన్ బిన్ అబ్దుల్లా, అబ్దుల్ సత్తార్, శంకర్ గౌడ్, ఎం. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 11న జ్యోతిబా పూలే జయంతి ఉత్సవం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా ఈ నెల 11న శనివారం ఉదయం 9.00 గంటలకు రోడ్లు భవనాల కార్యాలయం పక్కన ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని నటరాజ్ థియేటర్ పక్కన కల్వకుంట రోడ్డులో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, బడుగు బలహీన వర్గాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
10.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



జుట్టు సంరక్షణకు కెమికల్ షాంపూలు తగ్గించండి
జుట్టు దెబ్బతినకుండా ఉంటుంది. నేచురల్ బలం పెరుగుతుంది.



# మహిళా కోటాపై కేంద్ర కేబినెట్ ఏకపక్ష నిర్ణయం

- జాగృతి పోరాటాలతోనే మహిళా బిల్లు కార్యరూపం దాల్చుతోంది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈ బిల్లు అమలులో 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికగా తీసుకుంటామని చెప్పటం మహిళా లోకాన్ని మోసం చేయడమేనన్నారు. మహిళా కోటాకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో గురువారం ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. ప్రస్తుతం చేపట్టే జనగణనలో ఓబీసీ గణన చేయాలని డిమాండ్ చేశారు. జనగణన లో కులం కాలమ్ ఉన్నా వాళ్లు ఓబీసీలకు చెందుతారనే క్లాసిఫికేషన్ లేదన్నారు. దీంతో బీసీల జనాభా ఎంత అనే లెక్క తేలదన్నారు. జనగణన లో ఓబీసీలను లెక్కించి ఆ తర్వాతే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా కోటా విషయంలో బీజేపీ చేస్తున్న అన్యాయంపై పోరాటానికి బీసీ మహిళలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**డ్రాఫ్ట్ బిల్లు ముందే ఇవ్వాలి..**

మహిళా రిజర్వేషన్ల బిల్లు అమలు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్లమెంట్ సమావేశాలకు ముందే డ్రాఫ్ట్ బిల్లును అన్ని పార్టీలకు ఇవ్వాలని కవిత కోరారు. లేదంటే అభ్యంతరాలు చెప్పే అవకాశం ఉండదన్నారు. బిల్లుపై చర్చ జరిగే రోజు ఉదయమే సభ్యులకు బిల్లు పత్రులను ఇస్తామని చెప్పటమంటే కచ్చితంగా ఇది అన్యాయం చేసే కుట్రనని మండిపడ్డారు. డ్రాఫ్ట్ బిల్లును ముందే ఇచ్చే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు దేశంలోని జాతీయ పార్టీల నేతలతో మాట్లాడతానని చెప్పారు. పార్లమెంట్ లో మహిళ బిల్లు విషయంలో బీజేపీ వైఖరిని నిరసిస్తూ మహిళలకు న్యాయం చేసే విధంగా అన్ని పార్టీలు ఐక్యపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



# విద్యతోనే ఆదర్శ సమాజ నిర్మాణం

- జూన్ రెండు నుంచి పాఠశాలల్లో అల్పాహారం, కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, ఖమ్మం:**

విద్యతోనే ఆదర్శ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆయన ఖమ్మం జిల్లాలోని బోనకల్లు, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో స్కూళల్లో అల్పాహారం, కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ రెండో తేదీ నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం, ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. బడ్జెట్లో విద్యాశాఖకు 13.5 శాతం నిధులు కేటాయించినట్లు చెప్పారు. కేవలం విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వే ద్వారా స్పష్టమైందన్నారు. విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు పెడుతుందని తెలిపారు. విద్యాశాఖను చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు.

**అందరికీ నాణ్యమైన విద్య..**

రాష్ట్రంలో అందరికీ నాణ్యమైన విద్య అందించేందుకు ఒకేసారి 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం ప్రారంభించామన్నారు. అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట చదువుకునేందుకు వీలుగా ఈ స్కూళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల లో నాణ్యమైన ఆహారంతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పిల్లలు బాగా చదువుకునేందుకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తనకు తెలిసిన మిత్రులతో మాట్లాడి అమ్మ ఫౌండేషన్ ద్వారా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు, ఎర్రుపాలెం మండలాల్లో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు.

# జీవన్ రెడ్డి విమర్శలను జనం పట్టించుకోరు

- సీఎం రేవంత్ పోవాలని చెప్పడానికి ఆయన ఎవరూ..?
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ముద్ర, తెలంగాణ బ్యూరో:
కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేస్తోన్న విమర్శలను ప్రజలు పట్టించుకునే పరిస్తితిలో లేరని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పోవాలని చెప్పడానికి జీవన్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ ను విమర్శించే ముందు జీవన్ రెడ్డి గతంలో బీఆర్ఎస్‌పై చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలన్నారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి 14 సార్లు బీఫామ్ ఇచ్చిందని గుర్తు చేశారు. పొంగులేటిపై వచ్చిన భూ కబ్జా, అక్రమాల ఆరోపణలపై ఆధారాలు ఉంటే గాంధీ భవన్‌కు వచ్చి ఇవ్వాలన్నారు. ఆధారాలు తీసుకొని వస్తే తాను చర్చకు సిద్ధం అన్నారు.

**ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేదు..**

తనకున్న సమాచారం ప్రకారం మంత్రి వర్గ విస్తరణలో ఇప్పట్లో ఉండదన్నారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి నేతృత్వంలో మరింత బలోపేతంగా ముందుకు సాగాలని సూచించారు.

# కేసీఆర్ సీఎం కావాలి..

- రాష్ట్రంలో సీఎం రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు..
- జీవన్ రెడ్డి నిబద్ధత కలిగిన నేత
- బీఆర్ఎస్ లో చేరాలని ఆయన్ను కోరా
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- - మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే పేదల ముఖాలపై చిరునవ్వు కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం జగిత్యాలలోని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇంటికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ నాయకులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. కాగా అంతకుముందు పట్టణ శివారులోని ధరూర్ వద్ద కేటీఆర్ కు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కేటీఆర్ బైక్ ర్యాలీ ద్వారా జీవన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. జీవన్ రెడ్డితో కేటీఆర్ కొద్దిసేపు చర్చించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచన మేరకు తాను మాజీ మంత్రి జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించేందుకు జగిత్యాలకు వచ్చానని చెప్పారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను దాటవేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ కు విశేష సేవలు చేసిన జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నాయకులను అవమానిస్తున్నారని తెలిపారు. 2014లోనే పార్టీలోకి రావాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆహ్వానిస్తే, నిబద్ధత గల నాయకుడిగా జీవన్ రెడ్డి టీఆర్ ఎస్ లోకి రాలేదని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి, కేసీఆర్ ల అనుబంధం ఈనాటిది కాదన్నారు. 2014లో కేసీఆర్ సీఎం అయ్యాక బోర్నపల్లి బ్రిడ్జి కోసం నిధుల కేటాయించాలని జీవన్ రెడ్డి కోరితే అప్పటికప్పుడే రూ.75 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. అలాగే అసెంబ్లీలో నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరారన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి, ఎన్నికల్లో గెలిచాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు రైతులను, మరోవైపు నిరుద్యోగులను ఇలా అన్ని రంగాల వారిని మోసం చేసిందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ని గెలిపించి కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలని కోరారు.

**బీఆర్ఎస్ లో చేరుతా: జీవన్ రెడ్డి**

20 నెలలుగా కాంగ్రెస్ పార్టీలో మానసిక శోభకు గురయ్యానని, అవమానాలు భరించలేక ఆ పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని గద్ద దించే సత్తా గలిగిన బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. తాను ఎన్టీఆర్ ప్రభుత్వంతోపాటు చెన్నారెడ్డి, చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాలను చూశానని తెలిపారు. కానీ గడిచిన రెండేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అభివృద్ధి రివర్స్ అయిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కంటే కేసీఆరే నయమని ప్రజలు అనుకుంటున్నారని, మళ్లీ కేసీఆర్ పాలన ఉంటేనే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారని పేర్కొన్నారు.

**కేటీఆర్ పర్యటనలో అపశృతి..**

కేటీఆర్ పర్యటన సందర్భంగా జీవన్ రెడ్డి నివాసం వద్ద జరిగిన భారీ జన సమ్మర్ధంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో క్యూ న్యూస్ రిపోర్టర్ సాయి కుమార్ కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తోటి విలేకరులు స్థానిక ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. అలాగే పలువురు జర్నలిస్టులు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**గాయపడ్డ రిపోర్టర్ ను పరామర్శించిన మంత్రి అడ్లూరి..**

కేటీఆర్ జగిత్యాల పర్యటన లో రిపోర్టర్ సాయి కుమార్ కాలు ఫ్యాక్చర్ కాగా విషయం తెలుసుకున్న మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ హాస్పిటల్ కు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మంత్రి వెంట జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తదితర నాయకులు ఉన్నారు.

# ఇంధన భద్రతే లక్ష్యం

- గల్ఫ్ దేశాల్లో కేంద్ర మంత్రుల కీలక పర్యటనలు
- ఎల్ఎన్‌జీ సరఫరాలపై భారత్ కసరత్తు.. గల్ఫ్‌తో కీలక చర్చలు
- యుద్ధానికి బ్రేక్ తో ఇంధన పరిస్థితులపై ప్రభుత్వ చర్యలు
- కాల్పుల విరమణ తర్వాత గల్ఫ్‌లో చురుకైన భారత్ దౌత్యం



**ముద్ర డెస్క్:**

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ప్రపంచ ఇంధన మార్కెట్ లో ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో దేశీయంగా ఇంధన కొరత తలెత్తకుండా భారత్ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. గల్ఫ్ దేశాలతో ఇంధన సరఫరా భద్రతను పటిష్టం చేసేందుకు, సమన్వయాన్ని పెంచేందుకు కేంద్ర మంత్రులు వరుస పర్యటనలకు సిద్ధమవుతున్నారు.

**ఖతార్‌లో హర్దీప్ సింగ్ పూరీ పర్యటన..**

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ గురువారం నుంచి రెండు రోజుల పాటు ఖతార్‌లో పర్యటించనున్నారు. అధికారికంగా ఈ పర్యటన వివరాలను పూర్తిగా వెల్లడించనప్పటికీ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల రీత్యా ఇది అత్యంత కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల ప్రాంతీయ ఉద్రిక్తతల వల్ల ఖతార్‌లో లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్.ఎన్.జీ) ఉత్పత్తి, ఎగుమతులు తాత్కాలికంగా దెబ్బతిన్నాయి. ఇప్పుడు కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఖతార్ తిరిగి ఉత్పత్తిని ప్రారంభించే ప్రయత్నాల్లో ఉంది. ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు అవసరమైన ఎల్ఎన్‌జీ నిరంతరాయంగా వచ్చేలా దృష్టి సారిస్తున్నారు.

**హోర్ముజ్ జలసంధి సవాలు.. ప్రభుత్వ ధీమా**

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల సమయంలో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత భారత్‌కు పెద్ద సవాలుగా మారింది. ఈ మార్గం గుండానే భారత్‌కు అవసరమైన అధిక శాతం క్రూడ్ ఆయిల్, ఎల్ఎన్‌జీ రవాణా అవుతుంది. ఇది తాత్కాలికంగా మూతబడటంతో దేశంలో ఇంధన సంక్షోభం ఏర్పడుతుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ భయాలను తోసిపుచ్చింది. దేశంలో ప్రస్తుత అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. సరఫరాలో అంతరాయం కలిగితే ఇతర దేశాల నుంచి దిగుమతులు చేసుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది.

మొత్తానికి కేంద్ర మంత్రుల ఈ గల్ఫ్ పర్యటనలు కేవలం మర్యాదపూర్వకమైనవి కావు. ఈ పర్యటనల ద్వారా భారత్ తన ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది.

**యూఏఈకి విదేశాంగ మంత్రి జైశంకర్..**

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా దౌత్యపరమైన వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లో పర్యటించనున్నారు. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న తాజా భౌగోళిక, రాజకీయ పరిస్థితులతో ఇంధన సరఫరా గొలుసులో ఆటంకాలు కలగకుండా చూడటంపై ఆయన ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

# అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు

- దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రాధాన్యత
- మంత్రి పొన్నం ప్రభాకర్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రధానంగా దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ లో మంత్రి సమత కిచెన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థిక పునరావాస పథకం కింద ఆరుగురు ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులకు రూ. 75 వేల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను, అలాగే ఐదుగురు దివ్యాంగులకు రూ. 1,18,500 విలువగల బ్యాటరీ ఆధారిత వీల్‌చైర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధిగా అభివర్ణించారు. సమతా కిచెన్ ద్వారా దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇతర అట్టడుగు వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో సుమారు 10.47 లక్షల దివ్యాంగులు, 10 లక్షల మంది వృద్ధులు ఉన్నారన్నారు. అందులో హైదరాబాద్ జిల్లాలో సుమారు 2 లక్షల మంది వృద్ధులు నివసిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 404 మంది ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు పత్రాలు జారీ చేశామన్నారు.

రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు సమాజంలో అంతర్భాగమన్నారు. సమత కిచెన్ కు ఎంపీ ల్యాడ్స్ నిధులను అందిస్తానని తెలిపారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు పెరుగుతున్న అవకాశాలపై సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వారికి రాజకీయ, పరిపాలనా వ్యవస్థలో మరింత ప్రాతినిధ్యం అవసరమని అభిప్రాయపడ్డారు. కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ నిరంతర సహాయక చర్యలతో పాటు, సమతా కిచెన్ వంటి ఉపాధి ఆధారిత కార్యక్రమాల ద్వారా స్థిరమైన జీవనోపాధిని కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, జిల్లా దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ అధికారి రాజేందర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అశన్న, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియా అహ్మద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పవన్ కుమార్, ఏవో విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
10.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**జుట్టు సంరక్షణకు స్ట్రెస్ తగ్గించండి**

టెన్షన్ వల్ల హెయిర్ ఫాల్ పెరుగుతుంది. మైండ్ రిలాక్స్ అయితే జుట్టు కూడా బాగుంటుంది.



## యువతని క్రీడలవైపు మళ్లించడమే లక్ష్యం

- **ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవంలో ఎంపీ డీకే అరుణ**

**ముద్ర, నారాయణపేట:**

యువతను క్రీడలవైపు మళ్లించడమే ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం లక్ష్యమని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లో గురువారం జరిగిన ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తే ప్రొఫెషనల్ కోర్సులలో స్పోర్ట్స్ కోటలో సీట్లు వస్తాయన్నారు. క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేలా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి మండల కేంద్రంలో అన్ని ఆటలను నిర్వహిస్తామని, మొదటి సారి నాలుగు రకాల ఆటలు మాత్రమే నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన టీంలు నియోజకవర్గ స్థాయిలో ఆడుతారని, అక్కడ గెలిచిన టీమ్ లు పార్లమెంట్ స్థాయిలో ఆడుతారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యా యాదవ్, బీజేపీ పేట మండల అధ్యక్షులు జ్యోతి సాయిబన్న, పీఎం ఎస్ కేఎం పేట జిల్లా కన్వీనర్ తిరుపతి రెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, కౌన్సిలర్ కమలాపూర్ ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం నారాయణ పేట మండలం సింగారం, ఉట్కూరు మండలం పెద్దజట్రమ్ గ్రామాల్లో సీసీ రోడ్లు, హై మాస్ట్ లైట్స్ లను ఎంపీ ప్రారంభించారు. అభివృద్ధి పనులన్నింటిలో కేంద్రం వాటా ఉందన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయక ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.

## తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దు

- **ట్రైనీ పైలట్ కేసుపై డీసీపీ హెచ్చరిక**

**ముద్ర, మల్కాజిగిరి:**



మీడియా, సోషల్ మీడియా వేదికలు ధృవీకరించని సమాచారాన్ని పంచుకోవద్దని మల్కాజ్‌గిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్ కోరారు. బేగంపేటలో ట్రైనీ పైలట్‌పై నమోదైన లైంగిక దాడి కేసులో తప్పుదోవ పట్టించే సమాచారం ప్రచారం అవుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, ఎలాంటి ఊహాగానాలు దర్యాప్తుకు భంగం కలిగిస్తాయని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 72 ప్రకారం బాధితురాలి గుర్తింపును బయట పెట్టడం నేరమని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పరోక్ష వివరాలు కూడా వెల్లడించరాదని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో ఇప్పటికే ఇలాంటి కంటెంట్ షేర్ చేసిన వారు వెంటనే తొలగించాలని సూచించారు.

## జర్నలిస్టులు వృత్తి విలువలు పాటించాలి

**ముద్ర, కాప్రా:**

జర్నలిస్టులు వృత్తి విలువలు పాటించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోరారు. కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ నూతన కమిటీ బాధ్యతలు స్వీకారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులు నిర్భయంగా నిజాలను వెలికితీసి సమాజానికి చూపిస్తున్నారని, వారి కృషి అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఆరోగ్య భద్రత, బీమా సౌకర్యాలు, గృహ స్థలాల కేటాయింపు వంటి అంశాల్లో జర్నలిస్టులకు మరింత సహాయం అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కథనాలను అందించాలని, అప్పుడే సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో జర్నలిస్టులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ అధ్యక్షులు జ్యోతిర్మయ చారి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి తాము ముందుండి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే కోశాధికారి వెంకట్ రెడ్డి తోపాటు కాప్రా ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు, లైన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.




# పుష్కరాల కంటే ముందు పోలవరం పూర్తి

- **ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**ముద్ర, బాపట్ల:**



గోదావరి పుష్కరాల కంటే ముందు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. గురువారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం సూరేపల్లి సభలో ఆయన ప్రసంగించారు. అప్పుడు కృష్ణా డెల్టాకు నీటి సమస్య రాదని, గతంలో ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేస్తే గత పాలకులు గోదాట్లో కలిపేశారని అన్నారు. రూ.440 కోట్లతో కట్టిన డయాఫ్రామ్ వాల్ ను ముంచేశారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కేంద్ర సహకారంతో రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టి పూర్తి చేశామని అన్నారు. కొందరు నిర్మించిన వాటిని మరికొందరు కూలుస్తుంటారని, మళ్లీ వాటి పునర్నిర్మాణం చేయటం జరుగుతుందన్నారు. పోలవరం, అమరావతి రాజధానిని మళ్లీ పునర్నిర్మించే అవకాశం తనకు వచ్చిందని అన్నారు. రూ.4,660 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయకుండా విద్యుత్ ఛార్జీలను ట్రూ డౌన్ చేశామని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ కరెంటు ఛార్జీలను పెంచేది లేదని స్పష్టం చేశారు. గత పాలకులు తొమ్మిదిసార్లు కరెంటు ఛార్జీలు వేసి రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం వేశారని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్‌తో ప్రోజ్యూమర్ అనే విధానాన్ని తీసుకువస్తున్నామని ఆయన ప్రకటించారు. సామాన్యులకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గంజాయి రాష్ట్రంలో ఉండడానికి వీల్లేదని, ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అని హెచ్చరించారు. హాస్టళ్లు, బియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలు మధ్యాహ్న భోజనం తదితర అంశాల్లో మెరుగు పడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావడానికి వీల్లేదని, ఉచిత ఇసుక ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని, రూ.వెయ్యి కోట్ల ఆదాయం కోల్పోతున్నా ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నామని అన్నారు. పౌరసేవలు మెరుగ్గా అందించాల్సిందేనని, ఇందులో ఎలాంటి రాజీ లేదన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే తాను నిరంతరం ఆలోచన చేస్తానని అన్నారు. మారీచుడి కంటే ఎక్కువ వేషాలు రాష్ట్రంలోని ఓ పార్టీ వేస్తోందని విమర్శించారు.

# దూరిన 'పాక్'.. దెబ్బతిన్న సీజ్‌ఫైర్

- **సీజ్‌ఫైర్ ప్రకటనలో లెబనాన్ ప్రస్తావనతో కొత్త వివాదం**
- **పాక్ వ్యాఖ్యలతో అమెరికా–ఇజ్రాయెల్ అసహనం**
- **లెబనాన్‌పై దాడులు ఆపకపోతే ఒప్పందం కాదన్న ఇరాన్**
- **పాక్ పాత్రపై సందేహాలు**
- **శాంతి ప్రయత్నాలకు కొత్త చిక్కులు**
- **స్పష్టత లేక గందరగోళం**

**ముద్ర, డెస్క్ :**




పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నడుమ ప్రకటించిన అమెరికా-ఇరాన్ సీజ్‌ఫైర్ ఇప్పుడు కొత్త వివాదానికి దారి తీసింది. ఈ ఒప్పందం అమలు విధానం, పరిధి విషయంలో స్పష్టత లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయిలో గందరగోళం నెలకొంది. ముఖ్యంగా లెబనాన్ అంశం ఈ వివాదానికి కేంద్రబింధువుగా మారింది. సీజ్‌ఫైర్ ప్రకటన సమయంలో ఈ ఒప్పందం లెబనాన్‌కూ వర్తిస్తుందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పడం చర్చనీయాంశమైంది. అయితే ఈ వ్యాఖ్యలను అమెరికా, ఇజ్రాయెల్ వెంటనే ఖండించాయి. తమ మధ్య కుదిరిన ఒప్పందం కేవలం ఇరాన్‌కు సంబంధించిన అంశాలకే పరిమితమని స్పష్టం చేశాయి. ఇదిలా ఉంటే ఇరాన్ మాత్రం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది. లెబనాన్‌పై జరుగుతున్న దాడులు ఆగకపోతే సీజ్‌ఫైర్‌కు అర్థం లేదని, ఆ ప్రాంతంలో కూడా శాంతి నెలకొనాలంటే దాడులు నిలిపివేయాల్సిందేనని పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో లెబనాన్ పరిస్థితి మరింత సున్నితంగా మారింది. ఈ పరిణామాలతో పాకిస్థాన్ పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీజ్‌ఫైర్ వంటి ఒప్పందాన్ని ప్రకటించే ముందు సంబంధిత దేశాలతో పూర్తి సమన్వయం జరగలేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాకిస్థాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రకటన చేసి ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో శాంతి ప్రక్రియను దెబ్బతినే ప్రమాదం ఉంది. అన్ని దేశాలు ఏకాభిప్రాయానికి రాకపోతే ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో స్పష్టమైన ప్రకటనలు, సమన్వయం అవసరమని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నారు.

## ఏజెన్సీ రైతుల భూ సమస్యల పరిష్కారానికి
# కట్టుబడి ఉన్నాం

- **రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి నాగర్‌కర్నూల్:**



నల్లమల్ల ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ కట్టుబడి పనిచేస్తుందని చైర్మన్ ఎం. కోదండ రెడ్డి అన్నారు. గురువారం అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో రైతు సదస్సులో కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, రైతు కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో భూమి హక్కుల గుర్తింపు, పత్రాల లోపాలు, భూ వివాదాలు రైతులకు ప్రధాన అడ్డంకులుగా మారాయన్నారు. సమస్యలను కార్యాలయాల్లో కూర్చొని కాకుండా, నేరుగా రైతుల వద్దకు వెళ్లి తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టామని తెలిపారు. రైతులు తెలియజేసిన సమస్యలను సమగ్రంగా పరిశీలించి, ముఖ్యమంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన రైతుల భూ హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన ఆయన, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల బ్యాంకు రుణాలు అందకపోవడం వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని, సక్సెషన్ ప్రక్రియలను పూర్తి చేసి రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే కొన్ని గ్రామాల్లో భూములపై జాయింట్ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ నల్లమల్ల ఏజెన్సీ ప్రాంతంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అవసరమన్నారు. గతంలో సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు లేని రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. పోడు భూముల సమస్యల పరిష్కారం, అటవీ పరిరక్షణతో పాటు రైతులకు ప్రయోజనం కలిగే విధానాలు అమలు చేయాలని తెలిపారు. ఈ సదస్సులో రైతులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు. అధికారులు వాటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఆడంబర మెరుగని ఆదర్శ నేత చంద్ర రాజేశ్వర రావు

- **వర్థంతి సభలో కమ్యూనిస్టు నేతలు**

**ముద్ర, శేరిలింగంపల్లి:**

కమ్యూనిస్ట్ యోధుడు చంద్ర రాజేశ్వర్ రావు ఆడంబరమెరుగని ఆదర్శ నేత అని కమ్యూనిస్టు నేతలు కొనియాడారు. చంద్ర రాజేశ్వరరావు 32వ వర్థంతి సందర్భంగా హైదరాబాద్ కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ లోని అయన విగ్రహానికి సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితోనే సీఆర్ ఫౌండేషన్ను నిర్వహించి అందులో వృద్ధాశ్రమాన్ని, ఎన్ఆర్ఆర్ రిసర్చ్ సెంటర్, మహిళా సంక్షేమ కేంద్రం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధించడం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర రావు, ఉపాధ్యక్షులు అజీజ్ పాషా, జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస రెడ్డి, ఫౌండేషన్ కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర రావు, పి జే చంద్రశేఖర్ రావు, పిడికిటి సంధ్యాకుమారి, ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్, కోశాధికారి వి.చెన్నకేశవ రావు, కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, చాడ వెంకట రెడ్డి, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె. రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ శ్రీమతి జోశ్యభట్ల కల్పన, సభ్యులు బివి విజయలక్ష్మి, శ్రీమతి కనపర్తి జ్యోత్స్న, వి.లలిత పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు వృద్ధాశ్రమ వాసులు, మహిళా సంక్షేమ కేంద్రం వృత్తివిద్యా కోర్సుల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
10.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



జుట్టు సంరక్షణకు పోషకాహారం తీసుకోండి
విటమిన్లు జుట్టుకు అవసరం.
రూట్స్ బలంగా మారుతాయి.




# ఐపీఎల్ లో కొత్త నిబంధన..

- ఇక ఆటగాళ్లు అలా చేయడం కుదరదు

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ జోరుగా సాగుతోంది. ఆటగాళ్లు నువ్వా నేనా అన్నట్టుగా పోటీ పడుతున్నారు. జట్లు పోటాపోటీగా పరుగులు తీస్తున్నాయి. 200+ టార్గెట్ కూడా చిన్నగా మారిపోతుంది. ఆ టార్గెట్ ఫినిష్ చేయడానికి జట్లు చివరి వరకు పోరాడుతున్నాయి. ఈ సీజన్ ఐపీఎల్ లో ప్రారంభ మ్యాచ్ బెంగళూరు, హైదరాబాద్ మధ్య జరిగింది. హైదరాబాద్ ఏకంగా 200+ స్కోర్ చేసింది. ఆ టార్గెట్ ఫినిష్ చేయడానికి బెంగళూరు రంగంలోకి దిగి.. వేగంగా ఆడింది. ఓవర్లు పూర్తికాకముందే లక్ష్యాన్ని పూర్తి చేసి సంచలనం సృష్టించింది. ఐపీఎల్ లో ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన చేస్తున్న నేపథ్యంలో.. చూసేవాళ్ళకు అసలు సిసలైన క్రికెట్ మజా లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ నిర్వాహక కమిటీ ఒక కొత్త నిబంధనను తెరపైకి తీసుకువచ్చింది. దాని ప్రకారం ఇకపై టీం షీట్ లో ఉన్న 16 మంది ప్లేయర్లకు మాత్రమే గ్రౌండ్లో ప్రవేశించడానికి అవకాశం ఉంటుంది. మిగతా ప్లేయర్లకు ఆ అవకాశం ఉండదు. అంతేకాదు ఆ ప్లేయర్లు డ్రింక్స్, బ్యాట్లు, వర్తమానాలు తీసుకురాకూడదని స్పష్టం చేసింది. బౌండరీ చుట్టూ ఐదుగురు కంటే ఎక్కువ బెంచ్ ప్లేయర్లు ఉండకూడదని స్పష్టం చేసింది. ఎల్ఈడీ యాడ్ బోర్డులు.. బౌండరీ లైన్ మధ్య ప్లేయర్లు తిరగడానికి అవకాశం లేదని ఐపీఎల్ నిర్వాహక కమిటీ స్పష్టం చేసింది. ఈ నిబంధన పట్ల కొంతమంది ప్లేయర్లు పెదవి విరుస్తున్నారు. టి20 అనేది స్వల్ప కాలంలో పూర్తయ్యే ఫార్మాట్ అని.. అలాంటప్పుడు ఆటగాళ్లు మైదానంలోకి వస్తే తప్పేంటి అని ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల పోటీ హోరా హోరీగా సాగుతుందని.. ఆటగాళ్లు మరింత ఉత్సాహంతో ఆడేందుకు ఆస్కారం ఏర్పడుతుందని ప్లేయర్లు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ప్లేయర్లు కొంతమంది మైదానంలోకి రావడం.. డ్రింక్స్, బ్యాట్లు అందిస్తున్నామని సాకుతో వర్తమానాలను తీసుకురావడం పరిపాటిగా మారిపోయింది. దీనివల్ల క్రీడా స్ఫూర్తి పూర్తిగా దెబ్బతింటున్నదని ఐపీఎల్ నిర్వాహక కమిటీ భావించింది. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దీనివల్ల ఇకపై 16 మంది ప్లేయర్లు మాత్రమే గ్రౌండ్లోకి ప్రవేశించడానికి ఆస్కారం ఉంటుంది. మిగతా ప్లేయర్లు కేవలం రిజర్వ్ బెంచ్ కు మాత్రమే పరిమితమవుతారు. అంతేకాదు వాళ్లు కేవలం మ్యాచ్ మాత్రమే చూసేందుకు అవకాశం పొందుతారు. బయట నుంచి సంకేతాలు.. ఇతరత్రా ఈ విషయాలను ఆటగాళ్లకు చెప్పడానికి అవకాశం ఉండదు. ఒకవేళ ఈ నిబంధన ఎవరైనా ప్లేయర్లు అతిక్రమిస్తే తదుపరి చర్యలు తీవ్రంగా ఉంటాయని ఐపిఎల్ నిర్వాహక కమిటీ ఇప్పటికే స్పష్టం చేసింది.

# ఢిల్లీని ముంచిన కుల్దీప్ నిర్లక్ష్యం

## నెట్టింట ఫ్యాన్స్ రచ్చ



ముద్ర, స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా గుజరాత్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఒకే ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ ఓటమి పాలైంది. చివరి వరకు పోరాడినప్పటికీ కీలక సమయంలో జరిగిన తప్పిదాలు జట్టుకు చేదు ఫలితాన్ని మిగిల్చాయి. అయితే ఈ ఓటమిపై సోషల్ మీడియాలో ఫ్యాన్స్ మధ్య చర్చ మొదలైంది. మిల్లర్ తప్పిదం ఉన్నప్పటికీ, మరో ఎండ్‌లో ఉన్న కుల్దీప్ యాదవ్ కూడా నిర్లక్ష్యం వహించాడని కొంత మంది అభిమానులు విమర్శిస్తున్నారు. బంతి పడకముందే మిడిల్ పిచ్ వరకు ముందుకు వచ్చి ఉంటే పరిస్థితి మారేదని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ ఓటమిలో కుల్దీప్ నిర్లక్ష్యం కీలక పాత్ర పోషించిందంటూ సోషల్ మీడియాలో అభిమానులు పోస్టులు పెడుతూ రచ్చ చేస్తున్నారు. మ్యాచ్ అనంతరం మిల్లర్ భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్న దృశ్యాలు కూడా నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# రాశీ క్యాచ్‌పై వివాదం

## బౌండరీ తాకిందా..? నెట్టింట చర్చ

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఓ క్యాచ్ వివాదాస్పదంగా మారింది. ఫిన్ అలెన్ ఔట్ అయిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతా జట్టుకు ఆరంభం ఆశించినంతగా లేకపోయింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్ నాలుగో బంతికి ఓపెనర్ ఫిన్ అలెన్ కేవలం 9 పరుగులకే ఔటయ్యాడు. లక్నో బౌలర్ ప్రిన్స్ యాదవ్ వేసిన బంతిని భారీ షాట్ ఆడే ప్రయత్నంలో బంతి థర్డ్‌మ్యాన్ దిశగా ఎగిరింది. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న దిగ్వేష్ సింగ్ రాఠీ క్యాచ్ పట్టుకున్నాడు. అయితే క్యాచ్ తీసే సమయంలో రాఠీ బౌండరీ లైన్‌కు చాలా దగ్గరగా ఉన్నట్లు కనిపించడంతో వివాదం చెలరేగింది. అతని కాలు బౌండరీ లైన్‌ను తాకిందేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్యాచ్ పట్టిన తర్వాత బౌండరీ వద్ద ఉన్న ప్రకటన కర్టెన్ కూడా కదిలినట్లు వీడియోల్లో కనిపించడంతో సందేహాలు మరింత పెరిగాయి. అయినప్పటికీ ఫీల్డ్ అంపైర్ ఈ క్యాచ్‌ను ఔట్‌గా ప్రకటిస్తూ, థర్డ్ అంపైర్‌కు పంపలేదు. ఇదే ఇప్పుడు ప్రధాన చర్చకు దారితీసింది. అవసరమైతే థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేయాల్సిందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఫిన్ అలెన్ కూడా రివ్యూ కోరితే పరిస్థితి మారేదని నిపుణులు చెబుతున్నారు.

# గిల్ రికార్డు ఇన్నింగ్స్


గుజరాత్ తరపున 2500 పరుగులు పూర్తి



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత ఇన్నింగ్స్‌తో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు 20 ఓవర్లలో 210 పరుగులు సాధించగా, గిల్ కీలక పాత్ర పోషించాడు. గత మ్యాచ్‌లో పూర్తిగా ఫిట్‌గా లేకపోయిన గిల్, ఈ మ్యాచ్‌లో 45 బంతుల్లో 70 పరుగులు చేసి జట్టుకు బలమైన స్కోరు అందించాడు. తన ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లు బాదుతూ ఆకట్టుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ తరఫున మరెవరూ సాధించని ఘనతను గిల్ ఈ మ్యాచ్‌లో అందుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌తో గిల్ గుజరాత్ టైటాన్స్ తరఫున 2500 పరుగుల మైలురాయిని చేరుకున్న తొలి ఆటగాడిగా నిలిచాడు. 2022 సీజన్ నుంచి గుజరాత్ తరఫున ఆడుతున్న గిల్ ఇప్పటివరకు 62 మ్యాచ్‌ల్లో 46.50 సగటుతో 2558 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సెంచరీలు, 17 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అదే సమయంలో ఐపీఎల్ చరిత్రలో అత్యల్ప ఇన్నింగ్స్‌ల్లో 500 బౌండరీలు పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో కూడా గిల్ చోటు సంపాదించాడు. ఇప్పటివరకు 120 మ్యాచ్‌ల్లో 382 ఫోర్లు, 124 సిక్సర్లతో మొత్తం 506 బౌండరీలు నమోదు చేసి, ఈ జాబితాలో ఐదో స్థానంలో నిలిచాడు.

# డేవిడ్ మిల్లర్.. అప్పుడు.. ఇప్పుడు.. నష్ట జాతకుడు

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
డేవిడ్ మిల్లర్.. ఇప్పుడు ఈ పేరు సోషల్ మీడియాలో విపరీతంగా సర్క్యులేట్ అవుతోంది. మనదేశంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఈ పేరు విస్తృతంగా చర్చకు దారి తీస్తోంది.. వాస్తవానికి డేవిడ్ మిల్లర్. అద్భుతమైన క్రికెటర్. దక్షిణాఫ్రికా జట్టులో ప్రతిభావంతమైన ఆటగాడు. వేగంగా పగులు తీయగలడు. దూకుడుగా బ్యాటింగ్ చేయగలడు. పిచ్ సంబంధం లేకుండా ఆడగలడు. బౌలర్ ఎవరనేది చూడకుండా వీరోచితంగా ప్రదర్శన చేయగలడు. మిల్లర్ ఉన్నాడు అంటే విధ్వంసం కచ్చితంగా జరుగుతుందని అంటారు . అతడు ఆడిన ఆట.. చేసిన పరుగులు అలాంటి నానుడి పుట్టే విధంగా చేశాయి. అటువంటి మిల్లర్ 2024 లో జరిగిన టి20 వరల్డ్ కప్ లో ఫైనల్ మ్యాచ్లో అవుట్ కావడం దక్షిణాఫ్రికా జట్టుకు జీవితకాల బాధను కలిగించింది. జట్టు గెలుస్తుందనుకుంటున్న తరుణంలో మిల్లర్ అవుట్ కావడం ఆ జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది. మిల్లర్ అవుట్ కావడం అప్పట్లో విస్తృతమైన చర్చకు దారి తీసింది. మిల్లర్ ఔట్ అయిన తర్వాత.. పెవిలియన్ వెళ్తున్నప్పుడు కన్నీటి పర్యంతమయ్యాడు.. తట్టుకోలేక తల వంచుకున్నాడు. సేమ్ అలాంటి సన్నివేశం బుధవారం నాటి మ్యాచ్లో చోటుచేసుకుంది.



గుజరాత్ జట్టుతో జరిగిన మ్యాచ్లో ఢిల్లీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న మిల్లర్.. ముందుగా గాయపడ్డాడు.. ఆ తర్వాత జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు రంగంలోకి వచ్చాడు. సిరాజు ఓవర్లో విధ్వంసానికి పరాకాష్టగా బ్యాటింగ్ చేశాడు. చివర్లో విజయానికి రెండు పరుగులు అవసరమైన సందర్భంలో.. ఒక పరుగు తీసే అవకాశం వచ్చినప్పటికీ.. వదులుకున్నాడు. అలా అతడు చూపించిన అతి విశ్వాసం ఢిల్లీ జట్టు కొంపముంచింది. ఫలితంగా ఒక పరుగు తేడాతో ఢిల్లీ జట్టు ఓడి పోవలసి వచ్చింది. ఢిల్లీ జట్టు ఓటమి తర్వాత మిల్లర్ మీద విమర్శలు పెరిగిపోతున్నాయి. ఆ ఒక్క పరుగు తీసి ఉంటే మ్యాచ్ పరిస్థితి మరో విధంగా ఉండేదని.. అతి విశ్వాసానికి వెళ్లి మిల్లర్ పరువు తీసుకున్నాడని క్రికెట్ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.. " మిల్లర్ ముమ్మాటికి నష్ట జాతకుడు. అనవసరంగా వచ్చిన అవకాశాన్ని వదిలేసుకున్నాడు. అతడు గనుక ఆ పరుగు తీసి ఉంటే మ్యాచ్ ఫలితం మరో విధంగా ఉండేది. చివరి బంతికి బై రూపంలో ఒక పరుగు వచ్చినా సరే ఢిల్లీ జట్టు గెలిచేదని" క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మ్యాచ్ ఓడిపోయిన తర్వాత మిల్లర్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఆవేదనతో తల పట్టుకున్నాడు. ఆ సమయంలో ఢిల్లీ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్ అతడిని అనునయించాడు." నీ పని నువ్వు చేసావ్.. ఈసారి అదృష్టం మన వైపు లేదు. నీ ప్రయత్నంలో లోపం లేదు. నూటికి నూరు శాతం నీ ఎఫర్ట్ చూపించావని" అక్షర్ అతడిని ఓదార్చాడు. ఈ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో విపరీతంగా సర్క్యులేట్ అవుతోంది.


# ఢిల్లీని వెంటాడుతున్న "1" దరిద్రం



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
ఒకసారి జరిగితే దురదృష్టం అంటారు. రెండోసారి జరిగితే రాత బాగా లేదంటారు. మూడోసారి జరిగితే స్థితి బాగా లేదంటారు. కానీ మళ్ళీ జరిగితే దానిని దరిద్రం అంటారు. ఈ దరిద్రాన్ని ఢిల్లీ జట్టు నెత్తి మీద మోస్తున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే విజయానికి దగ్గరగా ఉన్న ఆ జట్టు.. చివర్లో ఒత్తిడికి గురై.. ఒక్క పరుగు తేడాతో ఓడిపోవడం ఆ జట్టుకు పరిపాటిగా మారింది. ఐపీఎల్ లో ఢిల్లీ జట్టుకు మంచి చరిత్ర ఉంది. ఇంతవరకు ఒకసారి కూడా ట్రోఫీ అందుకోలేక పోయినప్పటికీ.. ఆ జట్టు చేసే ప్రదర్శన ప్రతి ఏడాది అభిమానులకు కొత్తగానే కనిపిస్తుంది. ఈసారి కూడా వరుసగా రెండు విజయాలు సాధించింది. పాయింట్ల పట్టికలో టాప్ స్థానంలో కొనసాగుతోంది. ఈసారి ఢిల్లీ జట్టులో ప్లేయర్లు కూడా సమర్థవంతంగా ఉన్నారు. బౌలింగ్.. బ్యాటింగ్ ఇలా అన్ని విభాగాలలో సత్తా చూపిస్తున్నారు. బలమైన ముంబై జట్టును ఓడించి తన సత్తా చూపించిన ఢిల్లీ.. గుజరాత్ జట్టుతో జరిగిన మ్యాచ్లో మాత్రం ఒత్తిడికి గురైంది.. చివరికి ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. ఐపీఎల్ లో ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ జట్టు ఓడిపోవడం ఇదే తొలిసారి కాదు. ఐపీఎల్ చరిత్రలో ఢిల్లీ జట్టుకు మొత్తంగా నాలుగుసార్లు ఒక్క పరుగు తేడాతో ఓడిపోయిన చరిత్ర ఉంది. 2015లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ఢిల్లీ జట్టు ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైంది. 2016లో గుజరాత్ లయన్స్ జట్టు చేతిలో ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ పరాజయాన్ని మూట కట్టుకోవాల్సి వచ్చింది. 2021లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఢిల్లీ జట్టు ఓటమి పాలైంది. ఇక ప్రస్తుతం జరుగుతున్న సీజన్లో గుజరాత్ చేతిలో ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. బుధవారం నాటి మ్యాచ్లో గుజరాత్ గెలిచింది అనే దానికంటే.. ఢిల్లీ చేజేతులారా ఓడిపోయింది అని అనడం కరెక్ట్. వాస్తవానికి అక్కడ పరుగు తీసే అవకాశం ఉన్నప్పటికీ మిల్లర్ ఒప్పుకోలేదు. మిల్లర్ నిర్లక్ష్యం వల్ల ఢిల్లీ జట్టు ఓడిపోవలసి వచ్చింది. ఒకవేళ అతడి గనుక ఆ పరుగు తీసి ఉంటే మ్యాచ్ పరిస్థితి మరో విధంగా ఉండేది. చివరి బంతికి ఒక బై రూపంలో పరుగు వచ్చినా సరే.. ఢిల్లీ జట్టు విజయం సాధించేది. 211 పరుగుల లక్ష్యాన్ని చేదించడంలో మొదటి నుంచి దూకుడును ప్రదర్శించిన ఢిల్లీ.. మధ్యలో చేతులెత్తేసింది. చివర్లో పోరాడింది. కానీ విజయాన్ని అందుకోలేక ఒక్క పరుగు తేడాతో తలవంచింది..

# షమీ నోట.. కూలీ మాట..

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**
క్రికెటర్లను మన దేశంలో సెలబ్రిటీలుగా భావిస్తుంటారు. కొన్ని ప్రాంతాలలో డెమీ గాడ్స్ గా అభివర్ణిస్తుంటారు. కానీ.. క్రికెటర్ల వెనుక కూడా విపరీతమైన బాధ ఉంటుంది. క్రికెటర్లు అయినంత మాత్రాన అవకాశాలు పోలోమని రావు. అవకాశాలు వచ్చినప్పటికీ స్థిరంగా ఉండదు. ప్రతిభ ఉన్నప్పటికీ కొంతమంది ఆటగాళ్లకు అవకాశాలు రావడం ఎండమావిలాగా ఉంటుంది. ప్రతిభ ఉన్నప్పటికీ అవకాశాలు రాక ఇబ్బంది పడుతున్న ప్లేయర్లలో మహమ్మద్ షమీ ముందు వరుసలో ఉంటాడు. 2023 వరల్డ్ కప్ లో టీమిండియా తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా అతడు ఆవిర్భవించాడు. ఆ తర్వాత గాయం కావడంతో శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అనంతరం ఇండియాకు తిరిగి వచ్చిన అతడు.. జాతీయ జట్టులో అవకాశం కోసం గత రెండు సంవత్సరాలుగా ఎదురు చూస్తూనే ఉన్నాడు. డొమెస్టిక్ క్రికెట్లో సత్తా చూపిస్తున్నప్పటికీ మేనేజ్మెంట్ అతనికి అవకాశాలు ఇవ్వడం లేదు. ఐపీఎల్ లో కూడా 2025లో హైదరాబాద్ జట్టు తరుపున ఆడిన అతడు.. 2026 సీజన్ విషయానికి వచ్చేసరికి లక్నో జట్టుకు మారిపోయాడు. ఇటీవల హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్లో అతడు కీలకంగా వ్యవహరించాడు. లక్నో జట్టు తరఫున కీలక వికెట్లు పడగొట్టిన బౌలర్ గా నిలిచాడు. అంతేకాదు, మ్యాచ్ స్వరూపాన్ని మొత్తం మార్చేశాడు. లక్నో జట్టుతో జరిగిన మ్యాచ్ లో గెలిచిన తర్వాత షమీ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ముఖ్యంగా క్రికెట్ ఆడే వ్యక్తులను అతడు కూలీలుగా అభివర్ణించడం విశేషం.. "మేము కూలీలమే. బౌలింగ్ చేయడం కూలి కిందికే వస్తుంది. ఆటగాళ్ల జీవితంలో గాయాలు సర్వసాధారణం. ఎత్తు పల్లాలు కూడా అత్యంత సహజం. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నప్పుడు పడే కష్టాన్ని మర్చిపోకూడదు. కుర్రాళ్ళు ఈ విషయాన్ని గమనించాలి. ఫ్యాన్సీ విషయాలు కొద్దిసేపు మాత్రమే ఆనందాన్ని కలిగిస్తాయి. ఆ తర్వాత అవి బలహీనతగా మారిపోతాయని" షమీ వ్యాఖ్యానించాడు. భార్యతో విడాకులు.. ఇబ్బందికరంగా కెరియర్.. అవకాశాలు రాక పోవడం.. ఇంకా అనేక రకాల ప్రతి కూలతలు ఇబ్బంది పెడుతున్నప్పటికీ షమీ ఏమాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు వెళ్తున్నాడు. గత ఏడాది తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా షమీ భావోద్వేగానికి గురయ్యాడు. తన కుమార్తెను పట్టుకొని ఏడ్చాడు. భరణం ఇచ్చినప్పటికీ.. షమీ మాజీ భార్య అతడిని ఇబ్బంది పెడుతూనే ఉంది. ఇటు జట్టులో చోటు లభించకపోవడంతో అతడు పడుతున్న బాధ మామూలుగా లేదు. అయినప్పటికీ సూక్ష్మంలో మోక్షం అన్నట్టుగా ఆయన సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకొని.. ఇదిగో ఇలా ముందుకు సాగిపోతున్నాడు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
10.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# మాళవిక.. నీ అందాలు కేక



**ముద్ర సినిమా డెస్క్ :**
మాళవిక మోహనన్ ప్రస్తుతం తెలుగు తోపాటు తమిళ, మలయాళీ చిత్రాల్లో నటిస్తూ సూపర్ బిజీగా ఉన్నారు. ఈ భామ ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ హీరోగా వస్తోన్న రాజా సాబ్ లో హీరోయిన్‌గా నటించింది. ఇక అది అలా ఉంటే మాళవిక తాజాగా కొన్ని ఫోటోలను పంచుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పిక్స్ వైరల్ అవుతున్నాయి.ఆ ఫోటోలను చూసిన నెటిజన్స్ ఏం బాడీరా బాబు.. ఇంత ఫిట్ నెస్ ఏంటీ.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు.. సిక్స్ ప్యాక్ బాడీ ఏంటీ బాబోయ్ అంటూ ఆశ్చర్యపోతున్నారు. దీనికి సంబంధించిన పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి



## రామ్ చరణ్ తో పోటీకి సిద్ధమైన మెగాస్టార్.

'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్' చిత్రాల తర్వాత మెగాస్టార్ చిరంజీవి( మొదలు పెట్టిన చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార' వంటి భారీ బ్లాక్ బస్టర్ తర్వాత డైరెక్టర్ వశిష్ఠ తెరకెక్కించే సినిమా కావడంతో , 'విశ్వంభర' చిత్రం పై అప్పట్లో అంచనాలు భారీ రేంజ్ లో ఉండేవి. కానీ టీజర్ లో చూపించిన నాసిరకపు గ్రాఫిక్స్ పై సోషల్ మీడియా లో ఒక రేంజ్ లో ట్రోల్స్ పడడంతో మరోసారి గ్రాఫిక్స్ పై రీ వర్క్ చేయడం కోసం , ఈ చిత్రం విడుదలని ఇన్ని రోజులు నిలిపేశారు. ముందుగా మార్చి 27 న విడుదల చేద్దామని అనుకున్నారు, ఆ తర్వాత ఏప్రిల్ 30 కి వాయిదా వేశారు, ఇప్పటికీ కొన్ని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పెండింగ్ ఉండడం తో ఏకంగా జూన్ 25 కి వాయిదా వెయ్యాలని ఫిక్స్ అయ్యారట మేకర్స్. అదే కనుక నిజమైతే, తండ్రి కొడుకుల మధ్య బాక్స్ ఆఫీస్ పోరు ని చూడబోతున్నాము అనే అనుకోవచ్చు. గతం లో రామ్ చరణ్ #RRR రన్నింగ్ లో ఉన్నప్పుడే చిరంజీవి 'ఆచార్య' విడుదలైంది. ఈ సినిమా ఎంతటి ఘోరమైన పరాజయాన్ని అందుకుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పుడు 'విశ్వంభర' ని కూడా అలా విడుదల చేస్తే అదే ఫలితం రిపీట్ అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే 'విశ్వంభర' అనే చిత్రం ఉందనే విషయం మెగా ఫ్యాన్స్ కూడా మర్చిపోయారు. ఇలా పాడుబడిన సినిమాలకు బాక్స్ ఆఫీస్ వద్ద ఆడియన్స్ నుండి ఎలాంటి రెస్పాన్స్ వచ్చిందో ఈమధ్య కాలంలోనే చాలా ఉదాహరణలు చూశాము. 'విశ్వంభర' పరిస్థితి కూడా అంతే అని అంటున్నారు విశ్లేషకులు.

## 'తిమ్మరాజుపల్లి టీవీ' ట్రైలర్ విడుదల

న్యూ టాలెంట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో హీరో కిరణ్ అబ్బవరం కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్న "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రం ఈ నెల 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్లుగా పరిచయమవుతుండగా, వి. మునిరాజు దర్శకుడిగా ఈ చిత్రంతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సినిమా 80-90 దశకాల నేపథ్యంలో, ఒక ఊరిలో ఒకే టీవీ చుట్టూ జరిగే సంఘటనలతో సాగుతుందని చిత్రబృందం తెలిపింది. పల్లెటూరి జీవన విధానం, పాత జ్ఞాపకాలను గుర్తు చేసేలా సినిమా రూపొందించామని దర్శకుడు మునిరాజు అన్నారు. నిర్మాత కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, చిన్నతనంలో టీవీతో ఉన్న అనుబంధాన్ని ఈతరానికి చూపించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించామని తెలిపారు. కుటుంబ సమేతంగా చూసేలా రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేసింది.






## 'పెద్ది' స్పెషల్ కూడా వెనక్కి

**ముద్ర సినిమా డెస్క్ :**
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సినిమా 'పెద్ది' ఏప్రిల్ 30న విడుదల కావడం లేదని దాదాపు ఖరారైంది. ప్రస్తుతం ఒక స్పెషల్ సాంగ్ షూటింగ్ పెండింగ్‌లో ఉంది. సెట్ సిద్ధమైనప్పటికీ, ఇంకా హీరోయిన్ ఫిక్స్ కాకపోవడంతో షూటింగ్ వచ్చే వారానికి వాయిదా పడింది.ప్రస్తుతం రామ్ చరణ్ అనంత్ అంబానీ పుట్టినరోజు వేడుకల కోసం జామ్‌నగర్ వెళ్లాడు. ఆయన తిరిగి వచ్చేలోపు పాట కోసం హీరోయిన్‌ను ఫైనల్ చేయాలని టీమ్‌ను కోరాడు. మరోవైపు దర్శకుడు బుచ్చిబాబు చెన్నైలో ఏఆర్ రెహమాన్‌తో కలిసి సినిమా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనుల్లో బిజీగా ఉన్నాడు.సినిమా నిర్మాత వెంకట సతీష్ కిలారు ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులతో కొత్త విడుదల తేదీ గురించి చర్చిస్తున్నారు. షూటింగ్ అప్‌డేట్స్ మరియు కొత్త రిలీజ్ డేట్‌పై ఈ వీకెండ్ లోగా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.



## సినిమాలకు పూజా హెగ్డే గుడ్‌బై.?

**ముద్ర సినిమా డెస్క్ :**
ఓవైపు యాక్టింగ్, మరోవైపు డ్యాన్స్‌ఇంకోవైపు తన అందంతో ఫ్యాన్స్‌ను ఫిదా చేసిన పూజ హెగ్డే.. కొన్నాళ్లుగా సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. టాలీవుడ్ ప్రాజెక్టులను ఇప్పటికే తగ్గించి బాలీవుడ్ వైపు మొగ్గు చూపిన ఆమె, త్వరలోనే సినిమాలకే గుడ్‌బై చెప్పబోతున్నట్లు టాక్. కొన్ని పెద్ద తెలుగు మూవీస్ ఆఫర్ వచ్చినప్పటికి డేట్స్ క్లాష్ కావడంతో ఆ ప్రాజెక్టులను వదిలేసిందట పూజా. బాలీవుడ్‌లో కూడా కొత్త ప్రాజెక్టులపై ఆమెకు ఆసక్తి తగ్గినట్లు చెబుతున్నారు. దీంతో ఇక సినిమా రంగం నుంచి పూర్తిగా వైదొలగే ఆలోచనలో ఈ బుట్టుబొమ్మ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి



## బ్యాక్ లెస్ స్టైలిష్ లుక్‌లో అందాల రాశి

తెలుగు, తమిళ్, హిందీ చిత్రాల్లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్న అందాల భామ రాశి ఖన్నా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తరచూ తన ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. తాజాగా రాశి ఖన్నా షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. బ్యాక్‌లెస్ స్టైలిష్ డ్రెస్‌లో కనిపించిన ఆమె, తన అందాలను హైలైట్ చేస్తూ ప్రత్యేకంగా పోజులు ఇచ్చింది. ఫ్రంట్, బ్యాక్, సైడ్ యాంగిల్స్‌లో ఇచ్చిన స్టిల్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.చేతిలో చిన్న స్టైలిష్ బ్యాగ్ పట్టుకుని, పెద్ద ఇయర్ రింగ్స్ ధరించి ఇచ్చిన పోజులు ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. ముఖ్యంగా బ్యాక్, నడుము అందాలు హైలైట్ అయ్యేలా ఇచ్చిన స్టిల్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. దీంతో రాశి ఖన్నా తాజా ఫోటోలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

## 'వారణాసి' సాంగ్ : క్రేజీ ప్లాన్ తో ఆస్కార్ విన్నర్!

ముద్ర సినిమా డెస్క్ :

ప్రస్తుతం ఇండియన్ సినిమా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ సినిమాల్లో వారణాసి కూడా ఒకటి. సూపర్ స్టార్ మహేష్‌బాబు హీరోగా దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కించిన ఈ భారీ సినిమా నుంచి ఆల్రెడీ రెండు పాటలు హీరో, విలన్ లపై వచ్చేసాయి. అయితే ఇవి కాకుండా అసలు పాటల అప్డేట్ ఇపుడు తెలుస్తోంది. ఆస్కార్ విజేత ఎం ఎం కీరవాణి ఈ సినిమాకి కూడా వరల్డ్ క్లాస్ సంగీతం అందిస్తున్నారు. ఇలా ఈ సినిమాలో ఓ సాంగ్ కోసం బాలీవుడ్ పాపులర్ సింగర్ బాబుల్ సుప్రియోని ఎంచుకుని సాంగ్ కూడా పాడించేసినట్టు కన్ఫర్మ్ చేసారు. హిందీలో సహా బెంగాలీ భాషలో ఎన్నో సూపర్ హిట్ సాంగ్ ఇతని నుంచి ఉన్నాయి. 2000వ ఎరాలో బాబుల్ సాంగ్స్ మోత మోగాయి. మళ్లీ ఎట్టకేలకు ఆస్కార్ విన్నర్ తో వారణాసి లాంటి బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ లో తన సాంగ్ వస్తుండడం అనేది ఒకింత ఇంట్రెస్టింగ్ గా మారింది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఎలా ఉంటుందో వేచిచూద్దాం.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com